ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
తిరుపతి
జిల్లా వార్తలు
శనివారం 19 జులై 2025



3.45: పోలీస్ పరేడ్ మైదానంలో ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొంటారు.

అధికార పార్టీకి జిల్లాలో సమర్థ నాయకత్వం కొరత స్పష్టంగా కనిపిస్తోంది. దీని ప్రభావమూ క్షేత్రస్థాయిలో శ్రేణులపై పడుతోంది. ఈ క్రమంలో సొంత జిల్లాలో పార్టీ బలోపేతానికి అధినేత చంద్రబాబు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని నాయకులు, శ్రేణులు భావిస్తున్నాయి. శనివారం జిల్లాలో అధికారిక పర్యటనకు వస్తున్న సీఎం చంద్రబాబు.. కొంత సమయం పార్టీపైనా దృష్టి పెట్టి నేతలకు దిశానిర్దేశం చేయడంతో పాటు నాయకత్వ కొరత సమస్యను అధిగమించేలా నిర్ణయాలు తీసుకోవాలని శ్రేణులు కోరుతున్నారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

తిరుపతి, సత్యవేడు సెగ్మెంట్లలోనూ అదే పరిస్థితి

పదవుల భర్తీలో జాప్యంతో ఆశావహుల్లో అసంతృప్తి

బాబు గారూ.. దృష్టి పెడతారా?

జిల్లా టీడీపీకి సమర్థ నాయకత్వమేదీ?



తిరుపతి జిల్లా ఏర్పడి మూడేళ్లు దాటింది. జిల్లా అభివృద్ధికి తగిన దిశా నిర్దేశం చేయడానికి, ఎమ్మెల్యేలతో సమన్వయం చేసుకోవడానికి, మిత్ర పక్షాలను కలుపుకుని పోవడానికి తగిన బలమైన నాయకులంటూ లేకపోతున్నారు. ఇదివరకు మాజీ మంత్రులు బొజ్జల గోపాలకృష్ణారెడ్డి, గాలి ముద్దుకృష్ణమనాయుడు వంటి నేతలు జిల్లాపై సమగ్రమైన అవగాహనతో పాటు పట్టు కలిగి ఉండేవారు. వారి తరం గడచిపోవడంతో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మాజీ మంత్రి అమరనాథరెడ్డి, పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి జిల్లా నేతలుగా ఎదిగారు. వారికి మంత్రి పదవులు దక్కకపోవడంతో నిరాశ నిస్పృహలతో తమ నియోజకవర్గాలకే పరిమితమయ్యారు. ఫలితంగా తిరుపతి జిల్లా అనే కాకుండా మొత్తం ఉమ్మడి జిల్లాకే నాయకత్వం లేకుండాపోయింది. జిల్లా అభివృద్ధి విషయంలో ప్రభుత్వానికి ప్రతిపాదించడం నుంచీ పార్టీ శ్రేణుల సమస్యల వరకూ పట్టించుకునే వారు లేకుండాపోయారు. ఎమ్మెల్యేలలో ఎక్కువమంది తొలిసారి గెలిచిన వారు కావడంతో జిల్లాస్థాయిలో ప్రభావం చూపించే పరిస్థితి లేదు.



11.30: రేణిగుంట మండలం తూకివాకంలో తిరుపతి కార్పొరేషన్‌కు చెందిన ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజిమెంట్ ప్లాంట్ సందర్శన.

జిల్లా కేంద్రంలోనూ అదే పరిస్థితి

తిరుపతిలోనూ టీడీపీని నాయకత్వ కొరత పట్టి పీడిస్తోంది. తిరుపతి ఎమ్మెల్యే ఉన్నా, పార్టీపరంగా జనసేనకు ప్రాతినిథ్యం వహిస్తున్నారు. ఎమ్మెల్యే పదవి లేకపోవడంతో పాటు పార్టీకి కూడా బలమైన నాయకత్వం లేకపోవడం టీడీపీని బలహీనపరుస్తోంది. ఉన్నంతలో మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ పార్టీని నెట్టుకొస్తున్నారు. నిజానికి ఆమెది రాజకీయ నేపథ్యమున్న కుటుంబం. గతంలో ఆమె భర్త, ఆమె కూడా తిరుపతి ఎమ్మెల్యేలుగా పనిచేసిన వారే. సుదీర్ఘ రాజకీయ అనుభవం, అవగాహన ఉన్నప్పటికీ ఆమె తిరుపతి టీడీపీపై పూర్తిస్థాయిలో పట్టు సాధించలేకపోతున్నారు. రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవి ఇచ్చినా తిరుపతిలో అధికార యంత్రాంగం మీద పట్టు రావడం లేదు. దీంతో నామినేటెడ్ పదవులకు, ఇతర పనులకు నాయకులు ఎవరిని ఆశ్రయించాలో తోచక సతమతమవుతున్నాయి. రాష్ట్రంలోనే అతి కీలకమైన తిరుపతిలో పార్టీ దారీ తెన్నూలేని స్థితికి చేరుకోవడం శ్రేణులను ఆవేదనకు గురి చేస్తోంది.



మధ్యాహ్నం 12.15: తిరుపతి కపిలతీర్థంలో కపిలేశ్వరస్వామి దర్శనం. అక్కడే 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర' వాటాదారులతో ముఖాముఖి.

1.15: పోలీస్ పరేడ్ మైదానం చేరుకుని భోజనం చేసి కొంతసేపు విశ్రాంతి తీసుకుంటారు.

సత్యవేడులోనూ నాయకత్వ కొరత

సత్యవేడు నియోజకవర్గంలోనూ నాయకత్వ సమస్య తలెత్తింది. ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పార్టీ నుంచీ సస్పెండ్ కావడంతో పార్టీకి సుమారు తొమ్మిది నెలల పాటు నాయకత్వం లేకుండా పోయింది. ఇటీవల ఓ నిర్మాణ సంస్థ అధినేత కూరపాటి శంకర్‌రెడ్డిని కో ఆర్డినేటర్‌గా నియమించినా అక్కడ పార్టీ వ్యవహారాలు ఇంకా గాడిలో పడలేదు. ఎమ్మెల్యే ఆదిమూలం చాలా చురుగ్గా వ్యవహరిస్తున్నారు. నిత్యం ప్రజల మధ్యే తిరుగుతున్నారు. ప్రజలు, శ్రేణులు, అధికారులు తనను విస్మరించే అవకాశం ఇవ్వకుండా నియోజకవర్గాన్ని చుట్టేస్తున్నారు. ఆయన విషయంలో స్పష్టమైన నిర్ణయం తీసుకోకుండానే కో ఆర్డినేటర్‌ను నియమించడంతో వివాదాలు తలెత్తుతున్నాయి. అధికార యంత్రాంగానికి కూడా ఎవరితో ఎలా వ్యవహరించాలో తెలియడం లేదు. రిజర్వుడు నియోజకవర్గం కావడం, ఎమ్మెల్యేని నిర్లక్ష్యం చేస్తే ఏమవుతుందోనన్న సంశయం అధికారులను వెంటాడుతోంది. శంకర్‌రెడ్డికి ప్రొటోకాల్ ఉండే పదవిస్తే సాంకేతికంగా కొంత సానుకూలత ఏర్పడనుంది.

నామినేటెడ్ పదవుల భర్తీలో జాప్యంతో అసంతృప్తి

జిల్లాలో ఇంకా అనేక నామినేటెడ్ పదవులు భర్తీ కాలేదు. ఇంకొన్ని మార్కెట్ కమిటీలు, ఆలయ పాలకమండళ్లతో పాటు జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్ష పదవి కూడా వుంది. వీటికోసం ఏడాదిగా వేచి చూస్తున్న ఆశావహుల్లో.. జాప్యం జరిగే కొద్దీ అసంతృప్తి కలుగుతోంది. సీఎం చంద్రబాబు వీటిపై దృష్టి సారించి నామినేటెడ్ పదవులను త్వరగా భర్తీ చేయడంతో పాటు జిల్లా పార్టీలో నాయకత్వ కొరత లేకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది.

నియోజకవర్గాల వారీగా చూస్తే..

శ్రీకాళహస్తి: దేశవ్యాప్తంగా పేరు ప్రతిష్ఠలున్న ముక్కంటి ఆలయానికి ఇంకా పాలకమండలిని నియమించలేదు. అత్యంత ప్రాచీన ఆలయమైన గుడిమల్లం పరశురామేశ్వరాలయానిదీ అదే పరిస్థితి. శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటీకి కూడా పాలకవర్గం లేదు.

తిరుపతి: తాతయ్యగుంట గంగమ్మ గుడి పాలకమండలి ఛైర్మన్ పదవికి బాగా పోటీ ఉంది. దీనికీ పాలకమండలి ఏర్పాటు కాలేదు. **చంద్రగిరి:** తలకోన సిద్ధేశ్వరాలయం, పాకాల ఆనందగిరి సుబ్రమణ్యస్వామి ఆలయం,చంద్రగిరి మూలస్థాన ఎల్లమ్మ ఆలయాలకు కమిటీల్లేవు. **సత్యవేడు:** నాగలాపురం, బీఎన్ కండ్రిగ వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఖాళీగానే ఉన్నాయి. సురుటిపల్లి పల్లికొండేశ్వరాలయ ట్రస్టు బోర్డు కూడా ఏర్పాటు కాలేదు. **సూళ్లూరుపేట:** చెంగాలమ్మ ఆలయానికీ పాలకవర్గం ఏర్పాటు చేయలేదు. **వెంకటగిరి:** పోలేరమ్మ ఆలయానికి పాలక మండలి నియమించాల్సి ఉంది. **గూడూరు:** చిల్లకూరు మండలం తూర్పు కనుపూరులోని ముత్యాలమ్మ ఆలయం కూడా పాలక మండలికి నోచుకోలేదు.

నేడు తిరుపతికి సీఎం రాక

తిరుపతి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ప్రతినెలా మూడో శనివారం జరిగే 'స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర' కార్యక్రమంలో పాల్గొనేందుకు ఈసారి సీఎం చంద్రబాబు తిరుపతికి వస్తున్నారు. ఉదయం 11 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకునే ఆయన మొత్తం నాలుగు కార్యక్రమాల్లో పాల్గొని సాయంత్రం 5 గంటలకు తిరుగు ప్రయాణం కానున్నారు. కాగా, తొలుత ఖరారైన షెడ్యూలులో మళ్ళీ మార్పులు జరిగాయి. తిరుపతిలో కార్యక్రమాలు ముగించుకుని ఏర్పేడు సమీపంలోని ఐఐటీకి చేరుకుని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను సీఎం ప్రారంభించాల్సి వుంది. అక్కడి నుంచే అనంతపురం హబ్‌నూ వర్చువల్‌గా ప్రారంభించాలి. కానీ, చివరగా సీఎంవో నుంచీ విడుదల చేసిన షెడ్యూలులో ఆ కార్యక్రమాన్ని చేర్చలేదు. దీంతో ఇన్నోవేషన్ హబ్ ప్రారంభం వాయిదా పడినట్లయింది. సీఎం చంద్రబాబుకు పర్యటనలో పాల్గొనేందుకు.. ఏర్పాట్ల పరిశీలనకు శుక్రవారం సాయంత్రమే రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తిరుపతి చేరుకున్నారు.

● రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభం వాయిదా

సాయంత్రం 4 గంటలు: అలిపిరి వద్ద ఉన్న కంచి కామకోటి పీఠానికి చెందిన మఠానికి చేరుకుని కంచి స్వాములతో సమావేశమవుతారు. 4.30 గంటలకు విమానాశ్రయానికి బయలుదేరతారు.

5.00: రేణిగుంట విమానాశ్రయం నుంచి విజయవాడకు తిరుగు ప్రయాణం.

బంగారు తిరుచ్చిపై సిరుల తల్లి అభయం

తిరుచానూరు, జూలై 18(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారు శుక్రవారం బంగారు తిరుచ్చిపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఉదయం మూలమూర్తికి అభిషేకం, లక్ష్మీపూజ, కల్యాణోత్సవం వేడుకగా జరిగాయి. మధ్యాహ్నం ఉత్సవమూర్తికి స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం ఊంజల్‌సేవ అనంతరం అమ్మవారు మాడవీధుల్లో తిరుచ్చిపై విహరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, అర్చకులు బాబుస్వామి, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, చలపతి,సుబ్బరాయుడు, సుభాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మ ఉత్సవాలు ప్రారంభం

చంద్రగిరి, జూలై 18(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కనకదుర్గమ్మ ఆలయంలో శుక్రవారం ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈనెల 21 వరకూ ఈ వేడుకలను నిర్వహించనున్నారు. మొదటి రోజు అమ్మవారికి వివిధ రకాల అభిషేకాలు చేశారు. శనివారం దీపాలకంరణ, ఆదివారం చిన్న పుష్పపల్లకి, సోమవారం పెద్ద పుష్పపల్లకీ సేవ నిర్వహించనున్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన సింగు వంశస్తులు, శ్రీనివామంగాపురం గ్రామస్తులు ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు కమిటీ తెలిపారు.

దాత సాయంతో విద్యార్థులకు ఆటో సౌకర్యం



చంద్రగిరి, జూలై 18(ఆంధ్రజ్యోతి): కొటాల ఉన్నత పాఠశాల విద్యార్థులకు దాత ఉచిత రవాణా సౌకర్యం కల్పించారు. ఈ పాఠశాలకు నాగయ్య గారి పల్లి, రామిరెడ్డిపల్లి, కూచువారిపల్లి గ్రామాల నుంచి విద్యార్థులు వస్తుంటారు. విదార్థుల సంఖ్య, హాజరు శాతం పెంచేందుకు ప్రధానోపాధ్యాయుడు కేశవయ్య, ఉపాధ్యాయులు ఇటీవల పూర్వ విద్యార్థి హేమశేఖర్‌నుని కలిసి సహకరించాలని కోరారు. దీంతో ఆయన నెలకు రూ.7 వేలతో ఆటో సౌకర్యం ఏర్పాటు చేశారు. శుక్రవారం దాతకు ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

తొండవాడ ఉన్నత పాఠశాల తనిఖీ


విద్యార్థులకు సూచనలిస్తున్న డీఈవో కుమార్

చంద్రగిరి, జూలై 18(ఆంధ్రజ్యోతి): తొండవాడ ఉన్నత పాఠశాలను డీఈవో కేవీఎస్ కుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. తరగతి గదిలోకి వెళ్లి 10వ తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. పరీక్షలకు సంబంధించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. మధ్యాహ్న భోజన పథకం కోడిగుడ్లను పరిశీలించారు. బోధనలో నాణ్యత పెంచాలని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు సూచించారు. ఎంఈవో లలితకుమారి, తదితరులు పాల్గొన్నారు.

పద్మావతిలో తైవాన్ వర్సిటీ విద్యార్థుల బృందం

● నేడు శ్రీకాళహస్తిలో కలంకారి కళ పరిశీలన



అధికారులతో తైవాన్ విద్యార్థులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 18 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీని తైవాన్ యూనివర్సిటీ విద్యార్థులు శుక్రవారం సందర్శించారు. తైవాన్ యూనివర్సిటీకి చెందిన చుంగ్ చియా హ్స్వాన్ (సోషియాలజీ), హువాంగ్ చెన్ కై (డ్రామా), అకియామా (ఫారిన్ లాంగ్వేజెస్ అండ్ లిటరేచర్) నాలుగు రోజుల పాటు పద్మావతి వర్సిటీలో పర్యటించనున్నారు. తొలుత వీసీ ప్రొఫెసర్ ఉమ, రిజిస్ట్రార్ రజనితో వారు సమావేశమయ్యారు. యూనివర్సిటీలోని బోధన, పరిశోధన, విస్తరణ కృషి, సదుపాయాలు, ప్రమాణాలు, ప్రగతి, గుర్తింపు వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు. మహిళల కోసం ప్రత్యేక విశ్వవిద్యాలయాన్ని నిర్వహించడం గొప్ప విషయమన్నారు. దీనివల్ల మహిళలు అభివృద్ధి చెందడానికి అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. శ్రీకాళహస్తిలో పర్యటించి అక్కడి కలంకారి కళ గురించి ఈ బృందం పరిశీలించనుంది. వర్సిటీ ఇంటర్నేషనల్ అఫైర్స్ డీన్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

మౌనికకు కూటమి నేతల అభినందన


మౌనిక,మునిశేఖర్‌లను సత్కరిస్తున్న నాయకులు

తిరుపతి రూరల్, జూలై18(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఖరారైన మౌనికను శుక్రవారం పలువురు కూటమి పార్టీ నేతలు అభినందించారు. దుర్గసముద్రంలోని నివాసంలో మౌనిక, మునిశేఖర్ దంపతులను దుశ్శాలువా, పుష్పగుచ్ఛంతో అభినందించారు. టీడీపీ రూరల్ మండల అధ్యక్షుడు ఏ.ఈశ్వర్‌రెడ్డి, నాయకులు చెరుకుల పరంధామయాదవ్, చిన్ని, బాబురాయల్, రవి, చంద్రశేఖర్, చెంగల్రాయులు, నాగరాజు, సుబ్బురాయల్ పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకారంలో ద్రౌపదీ సమేత ధర్మరాజు

తిరుపతి రూరల్, జూలై18(ఆంధ్రజ్యోతి): దుర్గసముద్రంలోని ద్రౌపది సమేత ధర్మరాజస్వామి వార్షిక మహాభారత ఉత్సవాల్లో శుక్రవారం స్వామి, అమ్మవార్లు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామానికి చెందిన సిద్దమ్మ నేతృత్వంలో స్వామి, అమ్మవార్లకి 50లీటర్ల పాలు, 50లీటర్ల పెరుగుతో అభిషేకం నిర్వహించారు. వస్త్రసమర్పణ చేశారు. అన్నదానం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త మిట్టపల్లి ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతుల ఆత్మహత్యలు ఆపడంలో కేంద్రం విఫలం

●సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

తిరుపతి(ఆటోనగర్), జూలై18(ఆంధ్రజ్యోతి): రైతుల ఆత్మహత్యలను ఆపడంలో కేంద్రంలోని మోదీ ప్రభుత్వం విఫలమైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. తిరుపతి ఆటోనగర్‌లో శుక్రవారం సీపీఐ 14వ నగర మహాసభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ 11 ఏళ్లుగా దేశంలో బీజేపీ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో పూర్తిగా అప్పులపాలై దీనస్థితిలో బతుకుతున్నారని తెలిపారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని మండిపడ్డారు. మళ్లీ అధికారంలోకి వస్తే రైతుల కష్టాలను తీర్చుతామని గత ఎన్నికల్లో మోదీ ఇచ్చిన హామీ అమలు చేయకపోవడం దారుణమని దుయ్యబట్టారు. రుణమాఫీ చేస్తామని చెప్పి మోసం చేశారన్నారు. దేశవ్యాప్తంగా బ్యాంకుల్లో లక్షల కోట్లు అప్పులు చేసిన గుజరాత్ కార్పొరేటర్లపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. దేశంలో పేదరికం తగ్గిందని బీజేపీ చెబుతుండటం నిజమైతే ఇంకా 1.40 కోట్ల రేషన్ కార్డులు ఎలా ఉన్నాయని ప్రశ్నించారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించారని, 11 ఏళ్లుగా ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో చెప్పాలని నిలదీశారు. ప్రజాసమస్యలను పరిష్కరించుకుండా మతాల మధ్య చిచ్చు పెట్టే విధంగా ప్రసంగాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. తిరుమలకు వచ్చిన కేంద్ర మంత్రి బండి సంజయ్ టీటీడీలో అన్యమతస్తులు ఉన్నారని, వారిని తొలగించాలని డిమాండ్ చేయడమే ఇందుకు నిదర్శనమని అన్నారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన కూటమి పార్టీలకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. నాయకులు పి.హరినాథరెడ్డి, ఎ.రామానాయుడు, పి.మురళి, సి.పెంచలయ్య, రాధాకృష్ణ, విశ్వనాథం, శివ, నదియా, వైఎస్ మణి, కెవై రాజా, కె.రవి తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో కర్ణాటక హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి


ఆలయం ఎదుట జస్టిస్ కామేశ్వరరావు

తిరుచానూరు, జూలై 18(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారిని శుక్రవారం ఉదయం కర్ణాటక హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ .కామేశ్వరరావు దర్శించుకున్నారు. ఆలయం వద్ద అధికారులు, అర్చకులు ఆయనకు స్వాగతం పలికారు. అభిషేకానంతరం సేవలో అమ్మవారిని దర్శించుకున్నారు. వేదపండితులు జస్టిస్ .కామేశ్వరరావుకు వేదాశీర్వచనం ఇచ్చి తీర్థప్రసాదాలు అందజేశారు.

కుటుంబ సభ్యులకు విద్యార్థుల అప్పగింత

చంద్రగిరి, జూలై 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ బాలుర బీసీ సంక్షేమ వసతి గృహం నుంచి బుధవారం రాత్రి పరారైన 9వ తరగతి విద్యార్థులు శ్యామ్‌నాగరాజు, గోపిచంద్‌లను పోలీసులు శుక్రవారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. వీరు సదుం ఆర్టీసీ బస్టాండ్‌లో సంచరిస్తుండగా పోలీసులు గుర్తించిన సంగతి తెలిసిందే. ఈ ఇద్దరినీ కుటుంబ సభ్యులకు ఎస్‌ఐ అనిత అప్పగించారు.

కుంట పోరంబోకు కబ్జాయత్నం

● అడ్డుకున్న రెవెన్యూ అధికారులు


కబ్జాదారులతో మాట్లాడుతున్న అధికారులు

తిరుపతి అర్బన్, జూలై 18(ఆంధ్రజ్యోతి): మంగళం పరిధిలోని తిరుమలనగర్ గ్రామ పంచాయతీ చెన్నాయిగుంట గ్రామ లెక్కదాఖలా సర్వే నంబర్ 169/1లో 4.27 ఎకరాల గాండ్లవానిగుంట పోరంబోకు భూమిని శుక్రవారం కొందరు కబ్జాకు యత్నించారు. విషయం తెలుసుకున్న కోళ్లఫారం గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. వీఆర్వోలు ప్రసాద్, సతీష్ అక్కడికి చేరుకుని వారిని అడ్డుకున్నారు. తమ వద్ద పట్టాలున్నాయని వారు వాదనకు దిగారు. ఇది కుంటపోరంబోకు స్థలమని, దీన్ని ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని, ఆధారాలతో అర్బన్ తహసీల్దార్‌ను కలవాలని ఆదేశించారు. ఇది రెవెన్యూ రికార్డుల్లో గాండ్లవానిగుంట పోరంబోకు అని ఉందని అధికారులు మీడియాకు వివరించారు.

సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి

తిరుపతి(కలెక్టరేట్): జూలై 18(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు శనివారం తిరుపతి పర్యటన సందర్భంగా ఏర్పాట్లను సీఎం కార్యక్రమాల కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేశ్, కలెక్టర్ వెంకటేశ్వర్‌తో కలిసి శుక్రవారం రాత్రి ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ పరిశీలించారు. ప్రజా వేదిక ప్రాంగణం, స్టాల్స్ చూశారు. అంతకు ముందు కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధనరాజు, సీఎం కార్యక్రమాల కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కమిషనర్ మౌర్య తూకివాకం వేస్ట్‌మేనేజ్‌మెంట్ ప్లాంటు, కపిలతీర్థం, ప్రజావేదిక కార్యక్రమం జరిగే పోలీసు పరేడ్‌గ్రౌండ్, అలిపిరిరోడ్డులోని కంచి కామకోటి పీఠం ప్రాంతాలను పరిశీలించారు.

తిరుపతికి చేరిన వానిటీ బస్సు



తిరుపతి(ఆర్టీసీ), జూలై 18(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనను పురస్కరించుకొని వానిటీబస్సు శుక్రవారం ఉదయం తిరుపతికి చేరుకుంది. అలిపిరి ఆర్టీసీ డిపోలో నీటితో శుభ్రం చేసుకొని, ఇతర సాంకేతిక తనిఖీలు పూర్తిచేసుకొంది. శనివారం సీఎం కపిలతీర్థం, పోలీస్‌పేరేడ్ గ్రౌండ్ వద్ద సభలకు ఈ బస్సులోనే ప్రయాణించనున్నారు. గరుడవారధి మీదుగా ప్రయాణిస్తూ కపిలతీర్థం చేరుకోనున్నారు. ఈ సందర్భంగా గరుడ వారధికి ఇరువైపులున్న రక్షణ గోడలకు తెలుగు, నలుపు రంగులు పూర్తి చేశారు.

శాస్త్రోక్తంగా లక్ష్మీ కుబేర యజ్ఞం


లక్ష్మీకుబేర యజ్ఞం ప్రారంభిస్తున్న రుత్వికులు

రామచంద్రాపురం, జూలై 18(ఆంధ్రజ్యోతి): రామాపురం బ్రహర్షి పీఠంలో శుక్రవారం లక్ష్మీ కుబేర యజ్ఞం వైభవంగా ప్రారంభమైంది. యజ్ఞాన్ని మహారాష్ట్రకు చెందిన జగద్గురు స్వామి శాంతి గిరిజన ప్రభువు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఐదు రోజుల పాటు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు తిరిగి సాయంత్రం 4నుంచి రాత్రి 7గంటల వరకు యజ్ఞాన్ని నిర్వహించనున్నారు. 108 యజ్ఞ కుండాల్లో చేసే ఈ క్రతువులో 108మంది దంపతులు పాల్గొంటారు. ఈ సందర్భంగా ఉదయం లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. స్వామి అమ్మవార్లను అభిషేకించారు. సాయంత్రం 5 గంటలకు ఏకకాలంలో 108 యజ్ఞ కుండాల్లో రుత్వికులు లక్ష్మీకుబేర హోమాన్ని ప్రారంభించి పూర్ణాహుతితో ముగించారు.

గ్రామాల మధ్య సరిహద్దు 'పంచాయితీ'




సరిహద్దుపై ఎంపీడీవోతో మాట్లాడుతున్న పెరుమాళ్లపల్లెవాసులు(ఫైల్‌ఫొటో)

తిరుపతి రూరల్, జూలై18(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొన్ని విభజిత గ్రామ పంచాయతీల మధ్య సరిహద్దు వివాదం నడుస్తోంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో, అంతకుమునుపూ పలు ఉమ్మడి పంచాయతీలను విడదీశారు. అయితే కొత్త పంచాయతీల సరిహద్దులపై రెవెన్యూ రికార్డులు అందుబాటులో లేవు. 1995లో పుదిపట్ల నుంచి పెరుమాళ్లపల్లెని కొత్త పంచాయతీగా విభజించారు. ఈపంచాయతీలోని ఎస్వీనగర్ హ్యాబిటేషన్‌కి సంబంధించి భౌగోళిక హద్దు వివాదముంది. దీనికి ఆనుకుని ఉన్న కొంత ప్రాంతంలో బిల్డింగ్ అప్రూవల్స్, ఇంటి పన్నులు వంటివి ఇప్పటికీ పుదిపట్ల పంచాయతీకి చెల్లిస్తున్నారు. దీంతో తమ పంచాయతీకి ఆదాయం తగ్గుతోందని పెరుమాళ్లపల్లె గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఓ విద్యాసంస్థ భవన నిర్మాణానికి అనుమతిని కూడా పుదిపట్ల పంచాయతీలో తీసుకుంది. ఇది పుదిపట్ల పరిధిలోకి వస్తుందని నిర్ధారించేందుకు ఆధారం లేకపోవడంతో మిన్నకుండిపోయారు. హద్దులపై రెవెన్యూ స్కెచ్‌ల కోసం అధికారుల చుట్టూ తిరిగి విసిగిపోయామని గ్రామస్థులు చెబుతున్నారు. పద్మావతిపురం, శ్రీనివాసపురం పంచాయతీల మధ్య కూడా సరిహద్దు వివాదంపై ప్రజలు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేశారు.

ప్రాథమిక వసతుల మాటేంటి..

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో తనపల్లెలో ఎన్టీఆర్ గృహసముదాయాలను నిర్మించారు. ఇవి వేదాంతపురం పంచాయతీ పరిధిలోకి వస్తాయి. వైసీపీ హయాంలో ఈగృహాలను పంచాయతీకి అప్పగిస్తూ ప్రొసీడింగ్స్ ఇవ్వలేదని వేదాంతపురం పంచాయతీ పాలకులంటున్నారు. దీంతో ఇక్కడి ప్రజలు మౌలిక వసతుల కోసం ఇబ్బంది పడుతున్నారు. పంచాయతీ, కార్పొరేషన్ అధికారులు ఎవరికి వారు పట్టనట్టు ఉంటున్నారని కాలనీవాసులు వాపోతున్నారు. ఎంపీడీవో రామచంద్రను వివరణ కోరగా విడిపోయిన పంచాయతీల సర్వేనంబర్లు గెజిట్‌లో పొందుపరచి ఉంటారన్నారు ఉమ్మడి జిల్లా పంచాయతీ విభాగం గెజిట్‌లో నోటిఫికేషన్‌ను పరిశీలిస్తున్నామన్నారు. రిజిస్ట్రేషన్, స్టాంపు డ్యూటీ ఆయా పంచాయతీల ఖాతాలోనే జమవుతోందన్నారు. తనపల్లె ఇళ్ల కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపడుతున్నామన్నారు.

వకుళమాత ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం : టీటీడీ చైర్మన్


ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న చైర్మన్ బీఆర్‌నాయుడు,

తిరుపతి రూరల్, జూలై18(ఆంధ్రజ్యోతి): పేరూరుబండపై వెలసిన వకుళమాత ఆలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. శుక్రవారం సాయంత్రం టీటీడీ పాలకమండలి సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డితో కలసి ఆయన ఆలయాన్ని సందర్శించారు. భక్తులకు అందుతున్న సౌకర్యాలు, క్యూలైన్లను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి చేపట్టాల్సిన పనులపై నివేదిక తయారు చేయాలని అధికారులకు సూచించారు. తక్షణం చేపట్టాల్సిన పనుల వివరాలను పాలకమండలిలో చర్చించి ఆమోదిస్తామన్నారు. అంతకముందు ఆయన అమ్మవారిని దర్శించుకున్నారు.. అర్చకులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపీనాథ్, అధికారులు పాల్గొన్నారు.

ప్రేమించి పెళ్లిచేసుకుని... మూడు నెలలకే వదిలేశాడు

● నన్ను, నా బిడ్డను చంపడానికి ప్రయత్నిస్తున్నాడు ● డీఎస్పీకి బాధితురాలి ఫిర్యాదు


డీఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న రజని

పులివెందుల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పులివెందులకు చెందిన శ్రీపతి చక్రవర్తి అనే వ్యక్తి తనను ప్రేమించి పెళ్లి చేసుకుని గర్భిణీని చేసి మూడు నెలలకే వదిలేశాడని తిరుపతికి చెందిన కె.లావణ్య అలియాస్ రజని ఆవేదన వ్యక్తం చేశారు. తనను తన బిడ్డను చంపేందుక ప్రయత్నిస్తున్నాడని వాపోయారు. ఈ మేరకు పులివెందుల డీఎస్పీ మురళీ నాయక్‌కు శుక్రవారం రాత్రి ఆమె ఫిర్యాదు చేశారు. బాధితురాలి కథనం మేరకు..తిరుపతికి చెందిన రజనీని పులివెందులకు చెందిన శ్రీపతి చక్రవర్తి తిరుపతిలో చదువుకునే సమయంలో ప్రేమిస్తున్నానంటూ వెంటపడ్డాడు. చివరకు పెద్దల అంగీకారంతో 2021 ఆగస్టు 15వ తేదీ తిరుపతిలో వివాహం చేసుకున్నాడు. అనంతరం రజని పులివెందులలోని అత్తగారింటికి వచ్చారు. దాదాపు మూడు నెలల పాటు వీరి కాపురం సజావుగా సాగింది. ఇంతలో రజనీ గర్భం దాల్చడంతో భర్త, అత్తమామల నుంచి వేధింపులు మొదలయ్యాయి. ఈ విషయం తన తల్లిదండ్రులకు తెలియజేయడంతో వారు తమ కూతురి జీవితం నాశనం చేయొద్దని అల్లుడి కుటుంబ సభ్యులను ప్రాధేయపడ్డారు. అప్పటి నుంచి రజనీని శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేయడం మొదలు పెట్టారు. వీరి వేధింపులు ఎక్కువ కావడంతో విధిలేని పరిస్థితిలో గర్భవతియైన కుమార్తె రజనీని ఆమె తల్లిదండ్రులు తిరుపతికి తీసుకెళ్లారు. అయితే వీరిని శ్రీపతి చక్రవర్తి బంధువుల ద్వారా బెదిరించడం మొదలు పెట్టాడు. బిడ్డ పుట్టాక కూడా అతడిలో మార్పు రాకపోగా.. బిడ్డను తీసుకొని వస్తే నిన్నూ నీ బిడ్డను చంపుతామని బెదిరించాడు. దీంతో తాను, తన బిడ్డ భయంభయంగా గడుపుతున్నామని రజని తెలిపారు. తన కుమారుడు పెద్దయితే ఆస్తిలో భాగం ఇవ్వాల్సి వస్తుందని చంపేందుకు రెండుసార్లు రెక్కీ నిర్వహించారని అన్నారు. కొన్ని నెలల క్రితం పులివెందులకు చెందిన మరొక అమ్మాయిని తనకు తెలియకుండా తన భర్త వివాహం చేసుకున్నాడన్నారు. దీనిపై తిరుపతి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానన్నారు. కానీ న్యాయం జరుగుతుందో లేదోనని.. పులివెందులకు వచ్చి డీఎస్పీ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

జిల్లా విభజనతో 'సీనియారిటీ' తారుమారు

● సీఎం సారూ, న్యాయం చేయండని కోరుతున్న తిరుపతి కానిస్టేబుళ్లు

తిరుపతి(నేరవిభాగం), జూలై 18 (ఆంధ్రజ్యోతి): 'పదేళ్ల కిందట తిరుపతి పోలీసు అర్బన్ జిల్లా ఏర్పాటు, తర్వాత జిల్లా విభజన వల్ల మా సీనియారిటీ తారుమారైంది. ఎన్నో ఏళ్లుగా మాకు పదోన్నతులు రాలేదు. జూనియర్లకు పదోన్నతులు వచ్చాయి. మాకు సీనియారిటీ ప్రాతిపదికన పదోన్నతులు కల్పించాలి' అని తిరుపతి కానిస్టేబుళ్లు కోరుతున్నారు. ఈ మేరకు శనివారం తిరుపతికి రానున్న సీఎం చంద్రబాబుకు వినతిపత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. 'ఉమ్మడి జిల్లాలో 2011లో దాదాపు 200 మంది కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. ఆ తర్వాత తిరుపతిని చిత్తూరు జిల్లా నుంచి వేరు చేసి తిరుపతి అర్బన్ పోలీసు జిల్లాగా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఉమ్మడి జిల్లా నుంచి 60 శాతం మంది కానిస్టేబుళ్లను చిత్తూరుకు, మిగిలిన 40 శాతాన్ని తిరుపతికి కేటాయించారు. ఆ తర్వాత కానిస్టేబుళ్లకు ప్రమోషన్లు కల్పించే విషయంలో ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన కాకుండా చిత్తూరు జిల్లాలో పని చేస్తున్న వారికే ప్రమోషన్లు కల్పించారు. దీంతో తిరుపతి జిల్లాలో పనిచేస్తున్న సీనియర్లకు అన్యాయం జరిగింది. 15 నుంచి 20 ఏళ్ల సీనియరిటీ ఉన్నా ప్రమోషన్లు రాకపోవడం బాధ కలిగిస్తోంది. ఇంకా కొత్తగా ఏర్పాటు చేసిన జిల్లాల నుంచి కొంత మందిని తిరుపతికి కేటాయించారు. కానీ చిత్తూరు జిల్లా నుంచి జూనియర్లకు హెడ్ కానిస్టేబుళ్లగా ప్రమోషన్ ఇచ్చి తిరుపతి జిల్లాకు పంపడంతో.. తిరుపతిలో పనిచేస్తున్న సీనియర్లకు మళ్లీ అన్యాయం జరిగింది. ఉదాహరణకు తిరుపతిలో 1998 బ్యాచ్‌కు మాత్రమే ప్రమోషన్లు వచ్చాయి. కానీ చిత్తూరులో 2009 బ్యాచ్‌కు కూడా ప్రమోషన్లు ఇచ్చారు. దీనివల్ల 2009 కంటే ముందు ఎంపికైన తిరుపతి కానిస్టేబుళ్లు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇందులో ఏపీఎస్పీ, రిజర్వు విభాగాల నుంచి సివిల్‌కు కన్వర్షన్ అయిన కానిస్టేబుళ్లు ఉన్నారు. మా విభాగాల్లో ప్రమోషన్లు తీసుకోకుండా సివిల్ సీనియారిటీలో ముందుగా ప్రమోషన్ ఇవ్వాలని కోర్టుకు వెళ్ళడంతో డైరెక్టుగా సివిల్ కానిస్టేబుళ్ళుగా నియమితులైన సీనియర్లు ఇబ్బందులకు గురవుతున్నారు. దీనిపై సీఎం చంద్రబాబు విచారించి సీనియర్లపై వివక్ష చూపకుండా ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఎంపికైన వారందరికీ ఒకే సీనియారిటీ ప్రాతిపదికన తక్షణం ప్రమోషన్లు ఇప్పించి న్యాయం చేయాలి' అని బాధిత పోలీసులు విజ్ఞప్తి చేశారు.

అమ్మ.. బంధాన్ని మరచి!

● అనుమానం, మద్యం మత్తుతో హతమార్చిన కొడుకు


శారద మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసు

తిరుపతి(నేరవిభాగం), జూలై 18(ఆంధ్రజ్యోతి): అమ్మ బంధాన్ని మరిచాడు. అనుమానంతో పగ పెంచుకున్నాడు. తరచూ గొడవపడుతూ.. చివరకు మద్యం మత్తులో గురువారం అర్ధరాత్రి గొంతు నులిమి హతమార్చాడు. అలిపిరి ఎస్‌ఐ నాగార్జునరెడ్డి తెలిపిన ప్రకారం.. తిరుపతి నగరం ఆటోనగర్ సమీపంలోని గొల్లవానిగుంటలో నివాసమున్న శారదకు 20 ఏళ్ల కిందట సురేష్‌తో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు. కుటుంబ పోషణ గగనంగా మారడంతో సురేష్ కొన్నేళ్ల కిందట కువైట్‌కు వెళ్లారు. ఆమె ఆటోనగర్‌లోని ఓ షోరూములో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో తల్లికి వివాహేతర సంబంధముందున్న అనుమానంతో పెద్ద కుమారుడు ధనుష్ తరచూ గొడవపడి చివరకు హత్య చేశాడు. మద్యం మత్తు దిగాక రొంపిచెర్ల మండలం మోటుమల్లెలలో కాపురమున్న తన అమ్మమ్మ పార్వతికి విషయం తెలియచేశాడు. ఆమె ఫిర్యాదు మేరకు అలిపిరి ఎస్‌ఐ నాగార్జున రెడ్డి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. ధనుష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

ఫేస్‌బుక్‌లో ఈవో పేరిట ఫేక్ అకౌంట్

● భక్తులు అప్రమత్తంగా ఉండాలన్న టీటీడీ

తిరుమల, జూలై18(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఈవో శ్యామలరావు పేరుతో ఫేస్‌బుక్‌లో గుర్తుతెలియని వ్యక్తులు నకిలీ ఖాతాను సృష్టించారని, భక్తులు అప్రమత్తంగా ఉండాలని టీటీడీ శుక్రవారం ఓ ప్రకటన ద్వారా తెలిపింది. ఈ నకిలీ ఖాతా నుంచి భక్తులకు సందేశాలు పంపుతూ డబ్బులు కావాలని కోరుతున్నారని తమ దృష్టికి వచ్చినట్టు పేర్కొంది. మోసగాళ్ల చర్యగా గుర్తించామని, ఇలాంటి నకిలీ అకౌంట్లకు దూరంగా ఉండాలని కోరింది. సందేహాస్పద సందేశాలు వస్తే టీటీడీ విజిలెన్స్ 98668 98630 నెంబరుకు తెలియజేయాలని కోరింది.




పాకాల మండలం పులివర్తివారిపల్లెలో శుక్రవారం చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని తల్లి లక్ష్మీభారతి పార్థివ దేహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, తుడా చైర్మన్ డాలర్ దివాకర్ రెడ్డి - ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, గాలి భానుప్రకాశ్

చెత్త నిల్వల తొలగింపు


చెత్తను తొలగిస్తున్న కార్మికులు

తిరుపతి(వైద్యం), జూలై 18(ఆంధ్రజ్యోతి): రుయా ఆస్పత్రి అత్యవసర విభాగం ముందు నిల్వవున్న చెత్తను శుక్రవారం ఉదయం తరలించారు. రుయాలో రోగుల అవస్థలు అంటూ ఆంధ్రజ్యోతిలో శుక్రవారం ప్రత్యేక కథనం ప్రచురితమైంది. స్పందించిన ఆస్పత్రి ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. ట్రక్కులను ఏర్పాటు చేసి చెత్తను తొలగించారు. చిన్నపిల్లల వార్డు ముందు స్తంభించిన డ్రైనేజీని చక్కదిద్దారు. భూగర్భ డ్రైనేజీ మరమ్మతులకు టెండర్లకు ఆదేశించారు. జలప్రసాదం వద్ద నూతన కొళాయిలు అమర్చారు.అన్నప్రసాద వితరణ కేంద్రం వద్ద వ్యర్థాలను తొలగించారు.మరుగుదొడ్ల వద్ద షీట్, సింకులను మార్చారు.దీంతో రోగులు, వారి సహాయకులు హర్షం వ్యక్తం చేశారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

10న భారతీయ కళావైభవం


ఎమ్మెల్యే ఆరణిని ఆహ్వానిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

తిరుపతి అర్బన్, జూలై18(ఆంధ్రజ్యోతి): ఆర్.కె.కళా సాంస్కృతిక ఫౌండేషన్ ఆధ్వర్యంలో వచ్చే నెల 10న మహతి కళాక్షేత్రంలో భారతీయ కళా వైభవ ప్రదర్శన నిర్వహించనున్నారు. ముఖ్య అతిథిగా హాజరుకావాలని సంస్థ నిర్వాహకులు లయన్ డాక్టర్ రంజిత్ శుక్రవారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును కలసి ఆహ్వానించారు. ఎన్టీఆర్ సినీరంగప్రవేశం చేసి 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పది పరీక్షల్లో ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులకు ఎన్టీఆర్ ప్రతిభా పురస్కారం, ప్రశంసాపత్రాలు అందజేయనున్నారు. ఆసక్తిగలవారు ఈ నెల 23వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాల కోసం 9848581940ను సంప్రదించాలని కోరారు.

వర్షానికి దెబ్బతిన్న నిర్మాణం


పాక్షికంగా దెబ్బతిన్న నిర్మాణం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీలో భారీ సెప్టిక్ ట్యాంకు నిర్మాణ పనులు చేపట్టారు. ఐదవ గేట్‌కు సమీపంలో ఇంజినీరింగ్ కాలేజీ వద్ద చేపట్టిన ఈ నిర్మాణం గురువారం కురిసిన భారీ వర్షం ధాటికి దెబ్బతింది. పైగా నిర్మాణంపై ఎండిపోయిన భారీ వృక్షం పడింది. దీనికితోడు నీరు వచ్చి చేరింది. దెబ్బతిన్న నిర్మాణాన్ని ఇంజినీరింగ్ అధికారులు పరిశీలించారు.

తిరుపతి

డ్రంకెన్ డ్రైవ్‌లో 14 మందికి జరిమానా

తిరుపతి(నేరవిభాగం), జూలై 18 (ఆంధ్రజ్యోతి) : నగరంలో మద్యం తాగి వాహనాలు నడిపిన కేసులో 14 మందికి జరిమానా విధిస్తూ తిరుపతి జిల్లా నాలుగవ అదనపు న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ శుక్రవారం తీర్పు చెప్పారు. ఒక్కొక్కరికి రూ 10వేలు చొప్పున రూ.1.40 లక్షలు జరిమానా విధించారు.

యోగా సాధన ద్వారా మానసిక వికాసం


బహుమతి పొందిన విద్యార్థినితో అనంత్ తదితరులు

తిరుపతి రూరల్, జూలై18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రతినిత్యమూ యోగా, వ్యాయామం సాధన చేయడం ద్వారా శారీరక, మానసిక వికాసాభివృద్ధిని సాధించవచ్చని ఫెమి9 ప్రతినిధి ఆర్.అనంత్ పేర్కొన్నారు. కరకంబాడీ రోడ్డులోని శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాలలో హార్మోన్స్‌లో మార్పు-ఆరోగ్యకరమైన జీవనశైలి అనే అంశంపై శుక్రవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ చదువుతోపాటు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. మంచి ఆహారం, వ్యాయామం సాధనచేయడం ద్వారా హార్మోన్స్ సమతుల్యంగా ఉంటాయన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్ర మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు మానసిక వికాసానికి పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ మన్నెం రామిరెడ్డి, డైరెక్టర్లు మన్నెం రామసుబ్బారెడ్డి, మన్నెం అరవింద్‌కుమార్‌రెడ్డి, ఉమెన్ ఎంపవర్మెంట్ కన్వీనర్ జి.చంద్రకళ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

25న నీలం సంజీవరెడ్డి స్మారకోపన్యాసం

తిరుపతి రూరల్, జూలై18 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ సెనెట్‌హాల్లో ఈ నెల 25వ తేదీన నీలం సంజీవరెడ్డి స్మారకోపన్యాసం, అవార్డుల ప్రదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు భారత గ్రామీణ అధ్యయనం, పరిశోధనా అకాడమీ(అగ్రశ్రీ) వ్యవస్థాపకుడు డాక్టర్ డి.సుందరరామ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్వీయూ పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేటివ్ విభాగాలతో కలసి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాజీ సభ్యుడు వై.వెంకటరామిరెడ్డికి విశిష్టరత్న పురస్కారాన్ని ప్రదానం చేస్తామని వెల్లడించారు.

'మోసపు హామీలతో అధికారంలోకొచ్చారు'

తిరుపతి(జీవకోన), జూలై 18(ఆంధ్రజ్యోతి): అబద్ధపు హామీలతో కూటమి అధికారంలోకి వచ్చిందని వైసీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి విమర్శించారు. నగర పరిధిలోని గిరిపురం, ఎల్‌ఐసీరోడ్డు ప్రాంతాల్లో శుక్రవారం చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా అంటూ ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రామస్వామి, వెంకటేశ్వర్లు, ఆదిలక్ష్మి, కట్టా గోపీయాదవ్, గీత పాల్గొన్నారు.

వంతెన నిర్మాణం పూర్తయ్యేనా?


ప్రత్యామ్నాయ రోడ్డు కొట్టుకుపోవడంతో ఇబ్బందిపడుతున్న వాహనదారులు

తిరుపతి అర్బన్, జూలై 18(ఆంధ్రజ్యోతి): మంగళం-శెట్టిపల్లి రహదారికి మధ్యలో నిర్మిస్తున్న వంతెన నిర్మాణం నత్తనడకన సాగుతోంది. రెండు మూడు సంవత్సరాలుగా ఈ పనులు సాగుతూనే ఉన్నాయి. ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేసిన రోడ్డు సైతం వర్షాలకు కొట్టుకుపోయింది. పైగా రెండు రోజులుగా కురిసిన వర్షానికి రోడ్డుపై నీరు ప్రవహిస్తోంది. ఈ క్రమంలో వెళ్లడానికి దారిలేక వాహనచోదకులు నానా అవస్థలు పడుతున్నారు. కాగా, రోడ్డు పక్కనే ఏర్పాటు చేసిన తెలుగుగంగ పైపులు పగిలి నీరు వృథాగా పోతోంది. వాటి మరమ్మతుల కోసం ప్రస్తుతం తెలుగుగంగ నీటి సరఫరాను ఆపేశారు. నాలుగు రోజులుగా శెట్టిపల్లి గ్రామానికి తాగునీరు లేక గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు దీనిపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

యోగా పోటీల్లో బంగారు పతకం

సంస్కృత వర్సిటీ విద్యార్థిని సైరెంధ్రి దేహారి ప్రతిభ


సైరెంధ్రి దేహారిని అభినందిస్తున్న వీసీ కృష్ణమూర్తి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 18 (ఆంధ్రజ్యోతి): జాతీయ సంస్కృత యూనివర్సిటీ ఎమ్మెస్సీ యోగా థెరపీ విద్యార్థిని సైరెంధ్రి దేహారి ఒడిశాలో నిర్వహించిన యోగా పోటీల్లో బంగారు పతకాన్ని సాధించారు. ఆమెను వీసీ కృష్ణమూర్తి శుక్రవారం అభినందించారు. ఆయన మాట్లాడుతూ యోగా మనిషి శారీరక, మానసిక ఆరోగ్యానికి మంచిదన్నారు. ఇంతటి ప్రాముఖ్యత గల యోగా గురించి చదవవడమే గాక ప్రతిభా పోటీల్లో బంగారు పతకాన్ని సాధించడం యూనివర్సిటీకి ఎంతో గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం


బాధితులతో మాట్లాడుతున్న పోలీసులు

తిరుపతి (నేరవిభాగం), జూలై 18(ఆంధ్రజ్యోతి): భర్త వేధింపులు భరించలేక భార్య ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన తిరుపతి రూరల్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. బాధితురాలి వివరాల మేరకు.. తిరుపతి రూరల్ మండలం దుర్గసముద్రానికి చెందిన వెంకటేష్ ప్రైవేటు పాఠశాలలో వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. పుట్టింటి నుంచి కట్నం తీసుకురావాలని, లేకపోతే రెండో పెళ్లి చేసుకుంటానని కొన్ని రోజులుగా భార్య త్రిషను బెదిరిస్తున్నాడు. శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడు. వేధింపులు భరించలేక ఆమె శుక్రవారం పెట్రోలు క్యాన్‌తో నీళ్ల ట్యాంకు ఎక్కి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించింది. తన భర్త రెండో పెళ్లి చేసుకోకుండా ఆపాలని, అత్తామామ, మరుదుల నుంచి రక్షణ కల్పించాలని డిమాండ్ చేసింది. లేకపోతే పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుంటానని తెలిపింది. విషయం తెలుసుకున్న తిరుపతి రూరల్ పోలీసులు అక్కడికి చేరుకుని ఆమెకు నచ్చజెప్పి కిందకు దింపారు. ఈ విషయమై గతంలో ఎన్నోసార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని త్రిష ఆవేదన వ్యక్తం చేసింది. కాగా ఈ విషయంపై ఇప్పటివరకు తమకు ఎలాంటి ఫిర్యాదూ అందలేదని ఎస్ఐ రామకృష్ణ చెప్పారు.

బలిజ భవన్ పెండింగ్ నిధులు విడుదల చేయాలి


విలేకరులతో మాట్లాడుతున్న బండ్ల లక్ష్మీపతిరాయల్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎల్ఐసీ రోడ్డులో చేపట్టిన బలిజ భవన్ పెండింగ్ నిధులు విడుదల చేయాలని ప్రభుత్వానికి బలిజ భవన్ డెవెలప్‌మెంట్ సొసైటీ విజ్ఞప్తి చేసింది. ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం బలిజ భవన్ డెవెలప్‌మెంట్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు వసంతం శ్రీనివాసులు, పళ్లూరు శివప్రసాద్ మాట్లాడారు. 2017లో బలిజ భవన్ కోసం ఎకరా 51 సెంట్ల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించి, కాపు కార్పొరేషన్ ద్వారా రూ.2 కోట్ల నిధులు ప్రకటించారని తెలిపారు. రూ.37.98 లక్షలతో తుడా ద్వారా బలిజ భవన్ కట్టడానికి కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారని చెప్పారు. పనులు బేస్మెంట్ స్థాయికి చేరిన సమయంలో ప్రభుత్వం మారి నిధులు, పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. తిరుపతి పర్యటనకు శనివారం రానున్న సీఎం చంద్రబాబు పెండింగ్ నిధులు విడుదల చేసి బలిజ భవన్ పూర్తికి సహకారం అందించాలని కోరారు. సీఎంను కలిసి విన్నవిస్తామని తెలిపారు.కోశాధికారి గుత్తా నాగరాజ రాయల్, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, జాయింట్ సెక్రటరీ చింతంశెట్టి మల్లికార్జున, కార్యవర్గ సభ్యులు బండ్ల లక్ష్మీపతి, తుపాకుల మురళి,కోట చక్రపాణి, జల్లిశెట్టి విజయకుమార్ పాల్గొన్నారు.

రేపు బీఎన్ఐ కాన్ క్లేవ్



తిరుపతి (విశ్వవిద్యాల యాలు), జూలై 18 (ఆంధ్రజ్యోతి): బిజినెస్ నెట్‌వర్క్ ఇంటర్నేషనల్ (బీఎన్ఐ) 2వ ఎన్‌క్లేవ్ తిరుపతిలో ఆదివారం నిర్వహించనున్నారు. ఆశా కన్వెన్షన్ హాల్లో చేపట్టే ఈ కార్యక్రమానికి వ్యాపార, పారిశ్రామికవేత్తలు, స్టార్టప్ స్థాపకులు 1,500 మంది పాల్గొంటారని నిర్వాహకులు సంతోష్, మణిసందీప్, టెంకాయల దుర్గ, యుగంధర్‌రెడ్డి తెలిపారు. కనెక్ట్, కొలాబరేషన్, గ్రో అనే థీమ్‌తో చేపట్టనున్నట్టు చెప్పారు. సభ్యులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మా సమస్యల పరిష్కారానికి తోడ్పడండి

తుడా చైర్మన్‌కు ఎస్వీయూ హాస్టల్ ఎన్ఎంఆర్‌ల వినతి


దివాకరరెడ్డికి సమస్యలు చెబుతున్న ఎన్ఎంఆర్‌లు

తిరుపతి (విశ్వవిద్యాల యాలు), జూలై 18 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యల పరిష్కారానికి తోడ్పడాలని ఎస్వీయూ హాస్టల్ ఎన్ఎంఆర్‌లు తుడా చైర్మన్ దివాకరరెడ్డికి విన్నవించారు. అధికారులతో చర్చించి పరిష్కారానికి తోడ్పడతానని ఆయన వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంఆర్ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు రాజశేఖర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రచందనం స్మగ్లర్ అరెస్టు

● మూడు దుంగలు, మోటరు సైకిల్ స్వాధీనం


నిందితుడి అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు

మంగళం, జూలై 18(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా సానిపాయ సమీపంలోని వీరబల్లి అటవీ ప్రాంతంలో శుక్రవారం టాస్క్‌ఫోర్సు పోలీసులు ఒక స్మగ్లర్‌ను అరెస్టు చేశారు. ఆర్ఎస్ఐ నరేష్ బృందం స్థానిక ఎఫ్‌బీవో అనిల్‌కుమార్‌తో కలిసి వీరబల్లి ఫారెస్టు అటవీ బీటు పరిధిలో శుక్రవారం కూంబింగ్ చేస్తుండగా అయ్యలవారిపల్లి వద్ద ఒక వ్యక్తి మోటరు సైకిల్‌తో నిలబడి ఉండటాన్ని గమనించారు. పోలీసులను గమనించిన అతను పారిపోయే ప్రయత్నం చేయగా వెంబడించి పట్టుకున్నారు. మూడు ఎర్రచందనం దుంగలు, మోటరు సైకిల్ స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సీఐ సురేష్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న గణేష్‌కుమార్

తిరుపతి(కలెక్టరేట్), జూలై 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ సీఈవో, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ గణేష్‌కుమార్ అన్నారు. పద్మావతిపురంలోని ఐటీఐ ప్రాంగణంలో ఉన్న స్కిల్ హబ్ సెంటర్‌ను ఆయన పరిశీలించారు. అక్కడ వివిధ అంశాల్లో శిక్షణ పొందుతున్న నిరుద్యోగ యువతతో కోర్సులకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. సృజనాత్మకతను పెంచుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్ఎస్‌డీసీ ఈడీ రఘు, లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో డీఎస్పీ తనిఖీలు


అధికారులతో సమీక్షిస్తున్న డీఎస్పీ ఆకాష్‌కుమార్ జైస్వాల్

తిరుపతి(సెంట్రల్), జూలై18(ఆంధ్రజ్యోతి): తిరుపతి రైల్వే స్టేషన్‌లో శుక్రవారం గుంతకల్లు డీఎస్పీ ఆకాష్ కుమార్ జైస్వాల్ తనిఖీలు నిర్వహించారు. గుంతకల్లు డివిజన్‌లో నూతనంగా బాధ్యతలు తీసుకున్న ఆయన తిరుమలకు చేరుకుని శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం తిరుపతి రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు కల్పిస్తున్న భద్రతపై సమీక్షించారు. అసాంఘిక శక్తులపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు రాజగోపాల్ రెడ్డి, ఐపీఎఫ్‌లు సందీప్ కుమార్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి గ్రాప్లింగ్ రెజ్లింగ్ పోటీల్లో ప్రతిభ

జాతీయ స్థాయి పోటీలకు పద్మావతి జూనియర్ కాలేజీ విద్యార్థినులు


విజేతలను అభినందిస్తున్న అధ్యాపకులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి 5వ గ్రాప్లింగ్ రెజ్లింగ్ పోటీల్లో పద్మావతి మహిళా జూనియర్ కాలేజీ విద్యార్థినులు ఛాంపియన్లుగా నిలిచారు. తిరుపతిలోని గిరిజన భవన్‌లో నిర్వహించిన కుస్తీ పోటీల్లో వీరు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పలు పతకాలను సాధించారు. వీరితోపాటు 17 మంది విద్యార్థినులు బంగారు పతకాలను సాధించారు. జాతీయ స్థాయి పోటీలకు కూడా ఎంపికయ్యారు. వీరిని ప్రిన్సిపాల్ భువనేశ్వరి దేవి అభినందించారు. ఈ కార్యక్రమంలో కోచ్ సాయిసుమతి, అధ్యాపకులు పాల్గొన్నారు.


నైరుతీ రుతుపవనాల ప్రభావంతో తిరుపతి నగరంలో వర్షం బాగా కురుస్తోంది. వరుసగా మూడో రోజైన శుక్రవారం రాత్రి కూడా వాన పడింది. 8 గంటలకు ప్రారంభమై దాదాపు రెండు గంటలపాటు ఎడతెరిపి లేకుండా కురిసింది. రోడ్లంతా వర్షపు నీరు జోరుగా ప్రవహించింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వాహనదారులు, చిరు వ్యాపారులు, భక్తులు ఇబ్బందిపడాల్సి వచ్చింది.



మృతి చెందిన జింక

అలిపిరి వద్ద కుక్కల దాడిలో జింక మృతి

తిరుమల, జూలై18(ఆంధ్రజ్యోతి): అలిపిరి చెక్‌పాయింట్ సమీపంలో శుక్రవారం తెల్లవారు జామున కుక్కల దాడిలో జింక మృతి చెందింది. పొట్ట భాగంలో గాయాలతో మృతి చెంది పడివున్న జింకను చూసి తొలత చిరుత దాడిగా భావించారు. అయితే చిరుత దాడి చేస్తే మెడ భాగాన్ని నోటకరుచుకుని ఆ తర్వాత అడవిలోకి తీసుకెళ్లి తింటుందని, జింక పొట్టపై గాయాన్ని చూస్తే కుక్కలు దాడి చేసినట్టుగా ఉందని అటవీ అధికారులు చెప్పారు. అయినప్పటికీ విజిలెన్స్ అధికారులు భక్తులను అప్రమత్తం చేసి తిరుమలకు పంపారు.

పాత భవనాలు సిద్ధం చేయండి

● అధికారులను ఆదేశించిన ఈవో శ్యామలరావు

తిరుమల, జూలై18(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని పాత భవనాలను తగిన రిపేర్లతో ఉపయోగంలోకి తీసుకురావాలని టీటీడీ ఈవో శ్యామలరావు అధికారులను ఆదేశించారు. నిరుపయోగంగా ఉన్న అన్నపూర్ణ క్యాంటీన్ భవనాన్ని శుక్రవారం ఉదయం అదనపు ఈవో వెంకయ్య చౌదరితో కలిసి ఈవో పరిశీలించారు. హెచ్‌వీడీసీ, బాలాజీ నిలయం, తిరుమల మందిరం(ఆంప్రో రెస్ట్ హౌస్) విశ్రాంతి భవనాలను కూడా పరిశీలించారు. సీఈ సత్యనారాయణ, ఈఈ వేణుగోపాల్, డిప్యూటీ ఈవో భాస్కర్, రెవిన్యూ డిప్యూటీ ఈవో వెంకటేశ్వర్లు ఈవో వెంట ఉన్నారు.

తిరుమలలో నటి ప్రగ్యానయాన్

తిరుమల, జూలై18 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం సినీనటి ప్రగ్యా నయాన్, ఎంహెచ్‌సీ ప్లాంటేషన్ మేనేజింగ్ డైరెక్టర్ మహ్ కింగ్ థిన్, ఎమ్మెల్యేలు ఆదిమూలం, బొలిశెట్టి శ్రీనివాస్ దర్శించుకున్నారు.




సర్వదర్శనానికి 16 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 16 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని తొమ్మిది షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ దాకా ఉంది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.3.66 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 63,897

తలనీలాలు సమర్పించినవారు: 29,500



శభాశ్.. హరీశ్..!

● పాయింట్స్‌మన్‌కు డీఆర్ఎం అభినందన



హరీశ్‌కు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న డీఆర్ఎం సీఎస్ గుప్తా

గుంతకల్లు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రైల్వే స్టేషన్‌లో అగ్ని ప్రమాదం విస్తరించకుండా చర్యలు తీసుకున్న పాయింట్స్‌మన్ హరీశ్‌ను డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా అభినందించారు. అనంతపురం జిల్లా గుంతకల్లులోని రైల్వే డివిజనల్ కార్యాలయానికి రప్పించుకుని, శుక్రవారం ప్రతిభా పురస్కారాన్ని అందజేశారు. శాలువతో సన్మానించి, ప్రశంసాపత్రాన్ని, రివార్డును అందజేశారు. ఈ నెల 14న తిరుపతి స్టేషన్‌లో ఓ ఖాళీ బోగీలో మంటలు చెలరేగిన విషయం తెలిసిందే. దీన్ని గమనించిన పాయింట్స్‌మన్ హరీశ్, మంటలు వ్యాపించకుండా నిప్పంటుకున్న బోగీని ఇతర బోగీల నుంచి వేరుపరిచారు. రైల్వేకి ఆస్తి నష్టం జరక్కుంగా సమయోచితంగా వ్యవహరించారు. ప్రమాదం జరిగినప్పుడు అప్రమత్తంగా ఉండటమే కాకుండా ప్రాణాలకు తెగించి, ధైర్యసాహసాలను ప్రదర్శించారని డీఆర్ఎం అభినందించారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

● రూ.67లక్షల విత్తనాలు, పురుగు మందుల సీజ్



ఓ ట్రాన్స్‌పోర్టు కార్యాలయంలో పురుగు మందుల పరిశీలన

వెంకటగిరి టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): నకిలీ విత్తనాలు, పురుగు మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ నరసింహారావు హెచ్చరించారు. శుక్రవారం వెంకటగిరి డివిజన్ పరిధిలోని పలు దుకాణాల్లో ఆయన బృందం తనిఖీలు నిర్వహించింది. రైతులు తీసుకున్న ప్రతి వస్తువుకూ బిల్లు ఇవ్వడంతో పాటు రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. పూర్తిస్థాయిలో నమోదు చేయనందున రూ.21,99,979 విలువ గల ఎరువులు, రూ.45,19,240 పురుగు మందుల అమ్మకాలు నిలిపేశామన్నారు. ఓ రవాణా ట్రాన్స్‌పోర్టు కార్యాలయలో తనిఖీలు నిర్వహించి ఎటువంటి ఆధారాలు లేకుండా వచ్చిన పురుగు మందులు, విత్తనాలు పరిశీలించారు. నందాల, ఆంజనేయ, అనసూయ, ఏవో సుజాత, ప్రవీణ, శిరీష తదితరులు పాల్గొన్నారు.

● రేషన్ బియ్యం అక్రమ రవాణా కేసులో

వైసీపీ నేతను తప్పించేందుకు పైరవీలు

నాయుడుపేట టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం అక్రమ రవాణా కేసులో వైసీపీ నేతను తప్పించేందుకు ఆ పార్టీ నాయకులు జోరుగా పైరవీలు చేస్తున్నారు. ఈనెల 3వ తేదీ నాయుడుపేట - మల్లాం జంక్షన్ కూడలి వద్ద శ్రీకాళహస్తి నుంచి నెల్లూరుకు లారీలో అక్రమంగా తరలిస్తున్న 403 బస్తాల రేషన్ బియ్యాన్ని అర్బన్ సీఐ బాబి ఆధ్వర్యంలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. లారీ డ్రైవర్ గజేంద్రతో రేషన్ బియ్యం తరలింపులో వైసీపీ నాయకుడు పాత్ర ఉన్నట్లు తేలడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో సూళ్లూరుపేటకు చెందిన వైసీపీ నాయకులు శుక్రవారం రాత్రి పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకుని పోలీసులతో మంతనాలు ప్రారంభించారు. ఎలాగైనా కేసు నుంచి వైసీపీ నాయకుడిని తప్పించేందుకు ముమ్మరంగా ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు.

ఇద్దరు ఏపీపీల పదవీకాలం రద్దు

తిరుపతి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇద్దరు ఏపీపీల పదవీ కాలాన్ని ప్రభుత్వం రద్దు చేసింది. తిరుపతి అడిషినల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టుకు 2020 సెప్టెంబరు 9న న్యాయవాది సీహెచ్ శ్రీదేవి అడిషినల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులయ్యారు. ఆమె మూడేళ్ల పదవీ కాలం 2023 సెప్టెంబరులో ముగిసినా.. అదే ఏడాది నవంబరు నుంచీ కొనసాగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే, శ్రీకాళహస్తి అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టుకు గతేడాది మార్చి 15న న్యాయవాది సి.వీరరాఘవరెడ్డి అడిషినల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులయ్యారు. వీరిద్దరి పదవీ కాలాన్ని రద్దు చేయాలని రాష్ట్ర ప్రాసిక్యూషన్స్ విభాగం డైరెక్టర్ ప్రభుత్వానికి లేఖ రాశారు. దీంతో వారి పదవీ కాలాన్ని రద్దు చేస్తూ రాష్ట్ర హోమ్ శాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు.

● భర్త బావిలో తోసి చంపిన ఘటనలో

భార్యా బిడ్డలకు అంత్యక్రియలు పూర్తి

తలారివారిపల్లిలో అలుముకున్న విషాదఛాయలు



తల్లారివారిపల్లిలో బిడ్డల సహా హేమంతకుమారి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

కల్లూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా పాకాల మండలం మద్దినాయనిపల్లి పంచాయతీ పెద్దూరు హరిజనవాడకు చెందిన హేమంతకుమారి (35), ఇద్దరు బిడ్డలు తనుశ్రీ(11), తేజశ్రీ (8)లకు శుక్రవారం రాత్రి చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం కల్లూరు పంచాయతీ తలారివారిపల్లిలో అంత్యక్రియలు పూర్తిచేశారు. గురువారం మధ్యాహ్నం బంధువుల ఇంటికెళ్లొద్దామంటూ ద్విచక్రవాహనంపై భార్య, ఇద్దరు బిడ్డలను తీసుకెళ్లిన గిరి.. కోనేబోయిన ఇండ్లు సమీపంలోని బావిలో తోసేయడంతో ఆ ముగ్గురు మృతిచెందిన విషయం తెలిసిందే. తిరుపతి రుయాస్పత్రిలో మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించాక హేమంతకుమారి పుట్టిల్లయిన తలారివారిపల్లికు తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. తల్లీబిడ్డల మృతదేహాలను ఒక్క సారిగా చూసిన గ్రామస్తులు బోరున విలపించారు. దీంతో గ్రామంలో విషాఛాయలు అలుముకున్నాయి.



పద్మవ్యూహంలా కపిలతీర్థం

● ట్రాఫిక్ కష్టాలు
● సీఎం గారూ మీరైనా దృష్టిపెట్టండి

తిరుపతి- ఆంధ్రజ్యోతి

అత్యంత పవిత్రమైన శైవక్షేత్రంగా తిరుపతిలోని కపిలతీర్థం ప్రసిద్ధి చెందుతోంది. కొండమీద నుంచి దూకే జలపాతం, విశాలమైన పుష్కరిణి, మండపాలతో కూడిన ఈ తీర్థం.. స్థానికులకే కాక, తిరుమలకు వచ్చిపోయే భక్తులనూ ఆకర్షిస్తోంది. వాహనాల్లో ప్రయాణించేవారు అక్కడ ఆగి కపిలేశ్వరుని దర్శించుకుని వెళ్తుంటారు. దీంతో నంది కూడలి అత్యంత రద్దీ ప్రాంతంగా మారిపోయింది. ట్రాఫిక్ జాం అన్నది ఇక్కడ సాధారణ విషయం అయ్యింది. సోమవారం రోజుల్లో అయితే ఈ సర్కిల్ దాటడం పెద్ద సమస్యగా మారుతోంది. దీనికి తోడు ఈ కూడలిలో తిరుపతి కార్పొరేషన్ పిలిగ్రిమ్ ఎమినిటీస్ సెంటర్ పేరుతో నిర్మించిన వాణిజ్యభవనం వద్ద నిలిచి పోయే వాహనాలతో మరింత గందరగోళం ఏర్పడుతోంది. నిబంధనలు పాటించని భవనాలపై చర్యలు తీసుకోవాల్సిన కార్పొరేషనే ఏకంగా ఏ నిబంధనలూ పాటించకుండా ఈ భవనాన్ని నిర్మించడం విచిత్రం. వైసీపీ పెద్దల అండదండలతో అప్పట్లో కోరినట్లు ఆ పార్టీ నేతలు నిర్మించుకున్న ఈ భవనం ఇప్పటికీ ఇదే తీరులో నడుస్తోంది. ట్రాఫిక్ కు మరింత ఇబ్బందిగా మారింది. నేడు కపిలతీర్థంను సందర్శిస్తున్న సీఎం చంద్రబాబు ఈ అంశంపై దృష్టి పెట్టాలని నగర ప్రజలు కోరుకుంటున్నారు.

నందిసర్కిల్ వరకు గరుడవారధి

గరుడ వారధి తొలుత అనుకున్న ప్రకారం నంది సర్కిల్ వరకు నిర్మించి ఉంటే ట్రాఫిక్‌కు పెద్ద అంతరాయం కలిగివుండదు. అయితే వైసీపీ ప్రభుత్వం దానిని కుదించేసింది. అలిపిరి పోలీస్ స్టేషన్ వరకే పరిమితం చేసింది. పైగా రూ220 కోట్ల బడ్జెట్‌తో అలిపిరి దాకా పొడిగిస్తామంటూ అప్పటి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఏకండి డిజైన్ కూడా సిద్ధం చేయించారు. ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో వెనక్కి తగ్గారు. తొలి ప్లానింగ్ ప్రకారం కపిలతీర్థం దాటి మలుపుతిరిగేదాకా గరుడవారధిని పొడిగిస్తే తప్ప ఈ సమస్యకు పరిష్కారం లేదు.

కాలువలు కబ్జా

కొండమీద జల్లున పెద్ద వాన కురిస్తే చాలు కపిల తీర్థం, మాలాడగుండం జలపాతాలు ఉరకలేస్తూ దూకుతాయి. ఈ నీళ్లన్నీ వృథమవుతూ ఉంటాయి. అనేక చోట్ల ఆక్రమణలకు గురైపోయి ఇవి కుదించుకుపోయాయి. డ్రైజేజీతో కలిసిపోయి మురుగుకాలువలుగా ఈ రెండు కాలువలూ మారిపోయాయి. కపిల తీర్థం కాలువ అడుగున సిమెంటు లైనింగ్ వేసేయడంతో భూమిలోకి నీరు ఇంకకుండా జారిపోతోంది. ఇందువల్ల కాలువ తీర ప్రాంతాల్లోని భూగర్భజలాలు ఇంకిపోతున్నాయి. సిమెంట్ లైనింగ్ తొలగించాలని ప్రజలు కోరుతున్నా పట్టించుకోవడంలేదు.

కరకంబాడి - కపిలతీర్థం రోడ్డు ఏమైంది?

ఇక కపిలతీర్థం నుంచి కరకంబాడి వరకు గతంలో ప్రతిపాదించిన మార్గం ఇప్పటికీ ఆచరణలోకి రాలేదు. అటవీ అనుమతుల్లో జరుగుతున్న జాప్యమే ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఈరోడ్డును అందుబాటులోకి తీసుకొస్తే తిరుపతి నగరం మీద ట్రాఫిక్ ఒత్తిడి చాలా వరకూ తగ్గుతుంది.

ఎక్కడా ఏమరపాటు వద్దు

● సీఎం పర్యటనలో అప్రమత్తంగా ఉండాలంటూ ఎస్పీ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధన రాజు

తిరుపతి(నేరవిభాగం), జూలై 18 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో శనివారం సీఎం చంద్రబాబు పర్యటన సందర్భంగా ఏమాత్రం ఏమరపాటు లేకుండా విధులు నిర్వహించాలని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశించారు. పోలీసు అధికారులు, సిబ్బందికి శుక్రవారం పోలీసు పరేడ్ మైదానంలో బందోబస్తు విధులు కేటాయించి మాట్లాడారు. చంద్రబాబు పర్యటించే అన్ని చోట్ల అప్రమత్తంగా ఉంటూ, ప్రశాంత వాతావరణంలో పర్యటన సాగేలా చూడాలన్నారు. ప్రతి పోలీసు వారికి కేటాయించిన స్థలాలకు శుక్రవారం సాయంత్రం చేరుకుని విధుల్లో నిమగ్నం కావాలన్నారు. ఇప్పటికే పోలీసు శాఖ రిహార్సిల్స్ నిర్వహించింది. ఎవరైనా సీఎం పర్యటనను అడ్డుకునేలా చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. తిరుపతిలో అనుమానితులు దాదాపు 20 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఆరు గంటల పాటు తిరుపతిలో సాగనున్న సీఎం పర్యటనకు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సీఎం కాన్వాయ్‌లో కలెక్టర్‌తో పాటు ఎస్పీ, రిజర్వు బలగాలు ఉంటాయి. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకటరావు, కె.రవిమనోహరచారి, నాగభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

బందోబస్తు ఇలా

నలుగురు అదనపు ఎస్పీలు, పది మంది డీఎస్పీలు, 41 మంది సీఐలు, 73 మంది ఎస్‌ఐ లు, 288 మంది ఏఎస్‌ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, 490 మంది కానిస్టేబుళ్లు, 86 మంది మహిళా కానిస్టేబుళ్లు, 153 మంది హోం గార్డులు.. మొత్తం 1149మంది పోలీసు సిబ్బంది బందోబస్తులో పాల్గొంటారు. వీరికి విధులు కేటాయించారు.

'ప్రజా వేదిక'కు సర్వం సిద్ధం

● వర్షం వచ్చినా తడవకుండా 2500 మందికి ఏర్పాట్లు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి అనగాని, కలెక్టర్ తదితరులు

తిరుపతి(నేరవిభాగం), జూలై 18(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని పోలీసు పరేడ్ మైదానంలో శనివారం మధ్యాహ్నం సీఎం చంద్రబాబు నిర్వహించే ప్రజావేదికకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పీ4 కార్యక్రమం కింద దాతలుగా ముందుకు వచ్చిన మార్గదర్శులు, వారు దత్తత తీసుకునే బంగారు కుటుంబాలతో ముఖాముఖి సమావేశమవుతారు. ఈ కార్యక్రమంలో దాదాపు 2500 మంది పాల్గొంటున్నారు. భారీ వర్షం వచ్చినా తడవకుండా ఉండేలా రెయిన్ ప్రూఫ్ జర్మనీ టెంట్లు వేశారు. అక్కడే స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కింద ఆరు స్టాళ్లు ఏర్పాటు చేశారు. వచ్చిన వాళ్లందికీ తాగునీరు, బిస్కెట్లు, మజ్జిగ పంపిణీ చేయనున్నారు. మార్గదర్శుల్లో కొందరిని సీఎం సన్మానించనున్నారు. దాదాపు 1.45 గంటలపాటు జరగనున్న కార్యక్రమానికి సంబంధించి ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు. ఈ ఏర్పాట్లను మంత్రి అనగాని సత్యప్రసాద్, సీఎం కార్యక్రమాల కో ఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, తుడా చైర్మన్ డాలర్స్ దివాకరరెడ్డి, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోడూరు బాలసుబ్రహ్మణ్యం, రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్‌వర్మ, కూటమి నాయకులు, కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్పీ హర్షవర్ధనరాజు,కమిషనరు మౌర్య, ఆర్డీవో రామ్మోహన్‌రావు, అదనపు ఎస్పీలు వెంకట్రావు, రవిమనోహరాచ్చారి, నాగభూషణరావు, డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, జిల్లా అధికారులు పరిశీలించారు.



లక్ష్మీభారతి పార్థివ దేహం వద్ద నివాళులర్పిస్తున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తదితరులు, (ఇన్‌సెట్లో) లక్ష్మీభారతి ఫైల్ ఫొటో

చంద్రగిరి ఎమ్మెల్యే నానీకి మాతృవియోగం

● పలువురు నాయకుల నివాళి

పాకాల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానికి మాతృవియోగం కలిగింది. చిత్తూరులోని స్వగృహంలో శుక్రవారం ఉదయం నాని తల్లి లక్ష్మీభారతి(80) కన్నుమూశారు. కొద్దికాలంగా వృద్ధాప్య సంబంధ సమస్యలతో బాధపడుతున్నారు. పాకాల మండలం పులివర్తివారిపల్లెలో ఆమె పార్థివ దేహానికి ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీరిలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి, ఎమ్మెల్యేలు బొజ్జల సుధీర్ రెడ్డి, గాలి భానుప్రకాష్, డాక్టర్ మురళీమోహన్, ఆరణి శ్రీనివాసులు, థామస్, తుడా చెర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జ్ చల్లా రామచంద్ర రెడ్డి, డీసీసీబీ చైర్మన్ అమాస రాజశేఖర్ రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ సుబ్రమణ్యంనాయుడు, చంద్రగిరి ఏఎంసీ చైర్మన్ గౌస్‌బాషా, కిరణ్ రాయల్, సీకే లావణ్య, మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. నాని కుటుంబ సభ్యులకు నాయకులు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. తన తల్లి అంత్యక్రియలు శనివారం మధ్యాహ్నం 2.30 గంటలకు పులివర్తివారి పల్లెలో జరుగుతాయని ఎమ్మెల్యే పులివర్తి నాని తెలిపారు.

విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు

● అధికారులకు ఎస్పీడీసీఎల్ సీఎండీ ఆదేశం



అధికారులతో సమీక్షిస్తున్న సీఎండీ సంతోషరావు

తిరుపతి(ఆటోనగర్), జూలై18(ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కం పరిధిలోని ఐదు ఉమ్మడి జిల్లాల్లో గృహ వినియోగదారులకు, రైతులకు, పారిశ్రామికవేత్తలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా క్షేత్రస్థాయిలో పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సంస్థ సీఎండీ కె.సంతోషరావు ఆదేశించారు. తిరుపతిలోని అనెక్స్ భవనంలోని సమావేశ మందిరంలో అన్ని జిల్లాల అధికారులతో ఆయన సమావేశమయ్యారు. పీఎం సూర్యఘర్ పథకంపై వినియోగదారులకు అవగాహన కల్పించాలన్నారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరులో వేగం పెంచాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల పనితీరు మెరుగుపరచాలని సూచించారు. పొలాల్లో మరమ్మతులకు గురైన విద్యుత్ స్తంభాలను తొలగించాలని ఆదేశించారు. పెండింగ్ వర్క్ ఆర్డర్లు క్లోజ్ చేయని వారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సరఫరాలో అంతరాయం ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 1912కి లేదా 1800 425155333, 9133331912లకు ఫిర్యాదు చేయాలని వినియోగదారులకు సూచించారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు కె.గురవయ్య, పి.అయూబ్‌ఖాన్, సీజీఎంలు జె.రమణాదేవి, కె.ఆర్.ఎస్.ధర్మజ్ఞాని, డీఎస్ వరకుమార్, పి.హెచ్.జానకిరామ్, ఆదిశేషయ్య, శోభావాలంటీనా, కె.రామమోహన్‌రావు, పి.మురళి, జీఎంలు ఎం.కృష్ణారెడ్డి, నీలం నరేంద్రనాథ్, శ్రీనివాసులు, సురేంద్రనాథ్, మురళి, చక్రపాణి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

స్మార్ట్ ఉపగ్రహ తయారీ వర్క్‌షాప్



స్మార్ట్ ఉపగ్రహాలు తయారు చేస్తున్న విద్యార్థులు

మంగళం, జూలై 18(ఆంధ్రజ్యోతి): తిరుపతి రీజనల్ సైన్స్ సెంటర్‌లో చెన్నైకి చెందిన స్పేస్ కిడ్ ఇండియా వారి సహకారంతో శుక్రవారం విద్యార్థులకు స్మార్ట్ ఉపగ్రహ తయారీపై వర్క్‌షాప్ నిర్వహించారు. 23 పాఠశాలలకు చెందిన 70 మంది విద్యార్థులు పాల్గొన్నారు. స్మార్ట్ ఉపగ్రహాలు తయారు చేశారు. సైన్స్ సెంటర్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ శ్రీనివాస్ నెహ్రూ మాట్లాడుతూ అపోలో లావెల్ మిషన్ ద్వారా మనుషులు మొదటిసారి చంద్రుడిపైకి అడుగు పెట్టారన్నారు. ఈ సందర్భాన్ని గుర్తు చేసుకుటూ వారం రోజులు విద్యార్థులకు ఉపగ్రహంపై వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. స్పేస్ కిడ్ ఇండియా ప్రాజెక్టు ఇన్‌ఛార్జి యజ్ఞసాయి ఉపగ్రహం తయారీ, పనితీరుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సైన్స్‌సెంటర్ ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్ పురుషోత్తం, స్పేస్ కిడ్ ఇండియా మేనేజరు హాసిక పాల్గొన్నారు.



ఎమ్మెల్యేపై మహిళా కమిషన్‌కు రోజా ఫిర్యాదు

పుత్తూరు,జూలై18(ఆంధ్రజ్యోతి): తన వ్యక్తిత్వాన్ని కించపరుస్తూ పలు సందర్భాల్లో అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే భానుప్రకాష్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ మాజీ మంత్రి రోజా రాష్ట్ర మహిళా కమిషన్‌కు శుక్రవారం మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశారు. భాను చేసిన వ్యాఖ్యలను ఉటంకించారు. ఎమ్మెల్యే పదవిలో ఉండీ, ఇలా మాట్లాడుతున్న భానుప్రకాష్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

టీటీడీలో క్రైస్తవ ఉద్యోగిని తొలగించాలంటూ ఫిర్యాదు



చర్చిలో కన్నిగ (ఓంకార్ విడుదల చేసిన చిత్రమిది)

తిరుమల, జూలై18(ఆంధ్రజ్యోతి): టీటీడీలో క్రైస్తవ ఉద్యోగిని కన్నిగను తక్షణమే విధుల నుంచి తొలగించాలని తిరుక్షేత్రాల రక్షణ సమితి స్టేట్ ప్రెసిడెంట్ తుమ్మా ఓంకార్ శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. టీటీడీ విద్యుత్ విభాగం ఏఈ కన్నిగ ప్రతి ఆదివారం ఎస్వీ నగర్ చర్చిలో బైబిల్ తరగతులు చెబుతున్నారంటూ, ఆమె ప్రార్థన చేసిన వీడియోతో శుక్రవారం టీటీడీ ఈవో కార్యాలయంలో ఫిర్యాదు చేశామన్నారు. ప్రతి ఆదివారం చర్చిలో బైబిల్ క్లాసులు బోధిస్తున్న వీడియోను 2019లోనే టీటీడీకి అందజేసినా ఇప్పటివరకు పట్టించుకోలేదన్నారు. ఆమెపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, శాశ్వతంగా టీటీడీ నుంచి బహిష్కరించాలని డిమాండు చేశారు. ఈ మేరకు ఆమె చర్చిలో ఉన్న ఫొటోనూ ఓంకార్ విడుదల చేశారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

ఏఎంసీ పదవుల్లో మహిళలకు పెద్దపీట


ప్రమీల, నీరజ

గూడూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్లను నియమిస్తూ గురువారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో గూడూరు నియోజకవర్గ పరిధిలోని వాకాడు, చిల్లకూరు ఏఎంసీ చైర్ పర్సన్లుగా మహిళలను నియమించారు. పార్టీ విధేయులకు పట్టం కట్టడంతో టీడీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. మండల కేంద్రమైన చిల్లకూరు గ్రామానికి చెందిన చిల్లకూరు నీరజ భర్త పట్టాభిరామిరెడ్డి టీడీపీ సీనియర్ నాయకుడైన కొండేపాటి గంగాప్రసాద్‌కు ముఖ్య అనుచరుడు. పట్టాభిరామిరెడ్డి గతంలో చిల్లకూరు పీఏసీఎస్ అధ్యక్షుడిగా పనిచేశారు. అతని భార్య నీరజ 2006 నుంచి 2011 వరకు చిల్లకూరు సర్పంచుగా వ్యవహరించారు. మండలంలో టీడీపీ పటిష్టతకు ఎంతగానో కృషి చేస్తున్న పట్టాభిరామిరెడ్డి పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా వ్యవహరిస్తూ కార్యకర్తలకు అందుబాటులో ఉంటారు. వీరి సేవలను గుర్తించిన టీడీపీ అధిష్ఠానం జనరల్ మహిళ కోటాలో గూడూరు ఏఎంసీ చైర్‌పర్సన్‌గా నీరజను నియమించారు. వాకాడు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా మండల కేంద్రమైన కోట గ్రామానికి చెందిన టీడీపీ నేత, ఎంపీటీసీ దారా సురేష్ సతీమణి మర్రి ప్రమీలను రాష్ట్ర ప్రభుత్వం నియమిచింది. పదో తరగతి వరకు చదువుకున్న ప్రమీల పంచాయతీ 11వ వార్డు సభ్యురాలు. అలాగే కోట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సభ్యురాలుగా వ్యవహరిస్తున్నారు. ఈమె భర్త దారా సురేష్ రెండో పర్యాయం ఎంపీటీసీగా కొనసాగుతున్నారు. మండలంలో టీడీపీ పటిష్టతకు సురేష్ కృషి చేస్తున్నారు. మహిళా కోటాలో వాకాడు ఏఎంసీ చైర్‌పర్సన్‌గా ప్రమీలను నియమించింది.

విధేయతకు అందలం


ఆకుతోట రమేష్

తడ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): టీడీపీ వీరాభిమాని స్థాయి నుంచి సామాన్య కార్యకర్తగా ప్రస్థానం ప్రారంభించిన ఆకుతోట రమేష్‌కు అధిష్ఠానం ఇన్నేళ్లకు సముచితస్థానం కల్పించింది. డిగ్రీ పట్టభద్రుడైన ఆకుతోట రమేష్ ఎన్టీఆర్‌పై అభిమానంతో 1984 నుంచి టీడీపీ కార్యకర్త. అప్పటి పంచాయతీ వార్డు మెంబరు పోకల రమణయ్య అనుచరుడిగా ప్రస్థానం ప్రారంభించి వేనాటి కుటుంబానికి దగ్గరయ్యారు. 1994లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో తొలిసారిగా వార్డు సభ్యుడిగా గెలుపొందారు. 2017లో చెంగాళమ్మ ట్రస్టుబోర్డు సభ్యుడిగా నియమితులయ్యారు. 2019 - 24 మధ్య అప్పటి వైసీపీ ప్రభుత్వ అవినీతి, ఆ పార్టీ నేతల అరాచకాలపై పోరాడారు. బెదిరింపులు, ప్రలోభాలు ఎదురైనా వెనక్కు తగ్గలేదు. 2023లో చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో పట్టణంలో ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలను నిర్వహించారు. 2024 ఎన్నికల్లో సూళ్లూరుపేట పట్టణంలో టీడీపీకి సుమారు 9వేలకు పైగా మెజార్టీ రావడానికి రమేష్ ఎంతో కృషి చేశారు.

కృషికి గుర్తింపు


విశ్వనాధ నాయుడు

వెంకటగిరి, జులై 18 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, ప్రముఖ పారిశ్రామిక వేత్త కొండేపాటి గంగాప్రసాద్‌కు ముఖ్య అనుచరుడైన పునుగోటి విశ్వనాద నాయుడు టీడీపీలో క్రియాశీల నేత. 2014లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో 22వ వార్డు నుంచి కౌన్సిలర్‌గా విజయం సాధించారు. వార్డు అభివృద్ధి కోసం ఎంతగానో కృషి చేశారు. తిరుపతి పార్లమెంటు వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా పనిచేశారు. అలాగే గ్రామశక్తి పోలేరమ్మ దేవస్థానం పాలకవర్గం సభ్యుడిగా సేవలందించారు. ఎన్నికలకు ముందు నారా లోకేశ్ నిర్వహించిన యువగళం పాదయాత్రలో 60రోజుల పాటు పాల్గొన్నారు. మొదటి నుంచి విధేయుడుగా ఉండడంతో పాటు పార్టీ బలోపేతానికి కృషి చేసిన పునుగోటి విశ్వనాధ నాయుడిని తాజాగా నామినేటెడ్ పదవి వరించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఎంసీ చైర్మన్‌గా నియమితులవడంతో తన బాధ్యత మరింత పెరిగిందని, మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. తనకు పదవి రావడానికి సహకరించిన ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, పారిశ్రామిక వేత్త కొండేపాటి గంగాప్రసాద్‌కు కృతజ్ఞలు తెలిపారు.

అభిమానికి అవకాశం


ఉయ్యాల ప్రవీణ్

తడ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మొదటి నుంచి పవన్ కల్యాణ్ అభిమాని అయిన ఉయ్యాల ప్రవీణ్ జనసేన ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగుతున్నారు. 2014లో కూటమి తరపున విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇది గుర్తించిన పవన్ కల్యాణ్ 2019లో సూళ్లూరుపేట నియోజవర్గ జనసేన అభ్యర్థిగా ఎన్నికల్లో అవకాశం ఇచ్చారు. వైసీపీ హయాంలో ప్రభుత్వ అరాచకాలకు వ్యతిరేకంగా టీడీపీతో కలసి పోరాటాలు చేశారు. 2024 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి నెలవల విజయశ్రీ గెలుపు కోసం కష్టపడి పనిచేశారు. దీంతో నాయుడుపేట ఏఎంసీ చైర్మన్‌గా నియమించారు.

పుత్తూరు వార్తలు

అక్రమాలకు పాల్పడితే చర్యలు


సమావేశంలో మాట్లాడతున్న ఎమ్మెల్యే భానుప్రకాశ్

పుత్తూరు టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): నియో జకవర్గంలో అక్రమాలకు పాల్పడినా, దౌర్జన్యం చేసి నా, గంజాయి సరఫరా చే స్తే చట్ట పరమైన చర్యలు తప్పవని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ హెచ్చరించారు. శుక్రవారం తడుకు, పరమేశ్వర మంగళంలోని సింగిల్ విండో అధ్యక్ష, కార్యదర్శుల ప్రమాణస్వీకారానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తడుకులో సింగిల్ విండో చైర్మన్‌గా కరుణాకర్, కార్యదర్శి భాస్కర్ శెట్టి, విజయబాస్కర్ రెడ్డి ప్రమాణా స్వీకారం చేశారు. స్థానికంగా ఉంటూ, ప్రజా సమస్యలను పరిష్కారించాలని సూచించారు. పదవులను అలంకార ప్రాయంగా కాకుండా బాధ్యతగా చే పట్టాలని కోరారు. రెండు రోజుల క్రితం వైసీపీ కౌన్సిలర్లుకు చెందిన ఏడు టిప్పర్లలో ఇసుకను తమిళ నాడుకు తరలిస్తుండగా పోలీసులు అడ్డుకున్నారని తెలిపారు. గత ఐదేళ్లలో వైసీపీ నాయకుల అక్రమాలకు అడ్డే లేకుండా పోయిం దన్నారు. అనంతరం పరమేశ్వర మంగళంలో సింగిల్‌విండో అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.మోహన్‌రాజు, సుధాకర్‌నాయుడు, జాన్‌భాస్కర్ ప్రమాణా స్వీకారం చేశారు. గంజి మాధవయ్య, జీవరత్నంనాయుడు, బాలాజి, వెంకటేష్, మార్కెట్ కమిటీ డైరక్టర్లు బాబునాయుడు, మహేష్, డీసీసీబీ అధికారి ఝాన్సీ రాణి, పుత్తూరు మేనేజర్ సందీప్, పర్యవేక్షకుడు రాజేష్, తడుకు సీఈవో వేణుగోపాల్, హరికృష్ణ, రాజేష్, గణేష్, సర్పంచ్ బొబ్బిలి, వెంకటరాయల్ పాల్గొన్నారు.

శాకంబరి అలంకారంలో వాసవాంబ



వడమాలపేట, జూలై 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాడమాసం శుక్రవారం సందర్భంగా వాసవీదేవిని వివిధ రకాల కూరగాయలతో సుందరంగా అలంకరించారు. సాయంత్రం మహిళలు లలిత సహస్ర నామార్చన, మణిదీపం పేరిట వంద దీపాలు వేలిగించి దీపార్చన చేశారు.

స్థానిక సంస్థలకు ప్రాధాన్యం

- గత ప్రభుత్వంలా నిధులు లాక్కోలేదు
- రూ.62.22 కోట్లు జమ చేశాం!
- గతంలో జడ్పీటీసీలు ఎందుకు ప్రశ్నించలేదు?
- జడ్పీ సర్వసభ్య సమావేశంలో మంత్రి ఆనం

నెల్లూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): 'గత పాలన తీరు వేరు. కూటమి పాలన వేరు. తమ ప్రభుత్వం స్థానిక సంస్థలకు అధిక ప్రాధాన్యం ఇస్తోంది. గతంలోలా పంచాయతీల నిధులను లాగేసుకోవడం లేదు. ఏడాది కాలంలో జిల్లాలో స్థానిక సంస్థలకు కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన రూ.62.22 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం నేరుగా స్థానిక సంస్థల ఖాతాల్లో జమ చేసింది' అని దేవదాయ, ధర్మదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన శుక్రవారం నెల్లూరులోని జడ్పీ సమావేశ మందిరంలో జరిగింది. ముందుగా జడ్పీ మాజీ చైర్మన్ బాలచెన్నయ్య మృతికి సంతాపం ప్రకటించారు. అనంతరం అరుణమ్మ సమావేశాన్ని ప్రారంభించగా, పంచాయతీ రాజ్, డ్వామా, డీఆర్‌డీఏ, విద్యా, విద్యుత్ శాఖలపై సమీక్ష జరిగింది. పలువురు జడ్పీటీసీలు, ఎంపీపీలు తమ ప్రాంతాల్లోని సమస్యలను ప్రస్తావించారు. 30 నెలలుగా గౌరవ వేతనం ఇవ్వలేదని, జడ్పీ జనరల్ ఫండ్ కింద ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్యేలు కూడా పలు అంశాలపై మాట్లాడటంతో వాటిని పరిష్కరించాలని మంత్రి, కలెక్టర్ జిల్లా అధికారులను ఆదేశించారు. చివరగా మంత్రి ఆనం మాట్లాడుతూ.. గౌరవ వేతనాన్ని జనరల్ ఫండ్ కింద చెల్లించి, తిరిగి రీయింబర్స్ చేసుకునే అవకాశం ఉన్నా జడ్పీ అధికారులు ఎందుకు అలా చేయలేదని ప్రశ్నించారు. ఇప్పుడు గౌరవ వేతనం గురించి మాట్లాడుతున్న జడ్పీటీసీలు.. గత ప్రభుత్వంలో సర్పంచుల నిధులు, అధికారాలు లాగేసుకున్నప్పుడు ఎందుకు మాట్లాడలేదని నిలదీశారు. తాము స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని, వారు ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని అనుకుంటే, వారికి సమాధానం కూడా అంతే కరుగ్గా వస్తుందని ఆనం వ్యాఖ్యానించారు. జిల్లా స్థాయి సమావేశాలకు అధికారులు సమగ్ర సమాచారంతో రావాలని, ఇకపై అలా రాకపోతే ఉపేక్షించేది లేదని కలెక్టర్‌కు సూచించారు. గత ప్రభుత్వ పుణ్యమా అంటూ రాష్ట్రంలో జలజీవన్ మిషన్ పనులు రద్దయ్యే ప్రమాదం వచ్చిందని, కానీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో మాట్లాడి మరో రెండేళ్ల సమయం పొడగించుకున్నారని మంత్రి వెల్లడించారు.


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పక్కన జడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ, కలెక్టర్ ఆనంద్, తదితరులు

నిధులు ఇవ్వాల్సిందే..

గతంలో వెంకటగిరి, బాలాయపల్లి, డక్కిలి, సైదాపురం మండలాల్లో శిథిలావస్థలో ఉన్న ఎంపీడీవో కార్యాలయాల స్థానంలో కొత్త భవనాలు నిర్మించేందుకు జడ్పీ నిధులు మంజూరు చేశారని, వాటిలో కొన్ని అసంపూర్తిగా ఉన్నాయని ఆయా జడ్పీటీసీ సభ్యులు ప్రస్తావించారు. మిగిలిన నిధులు మంజూరు చేస్తే భవనాలు పూర్తవుతాయని కోరారు. కానీ వీరి విన్నపాన్ని చైర్‌పర్సన్ అరుణమ్మ తిరస్కరించారు. నిధులు ఇవ్వడం సాధ్యం కాదని తేల్చి చెప్పారు. అయితే నిధులు ఇవ్వలేం అనడం.. సరైన సమాధానం కాదని మంత్రి ఆనం అన్నారు. పెండింగ్ నిధులను విడుదల చేయాలని ఆదేశించారు. అలానే ఇంతకాలం ఆ భవనాలను ఎందుకు పూర్తి చేయలేక పోయారో కలెక్టర్‌కు వివరణ పంపాలని జడ్పీ సీఈవోకు సూచించారు.

ప్రజా సమస్యల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు: పాశం


రాఘవారిపాళెంలో మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీల్ కుమార్

చిట్టమూరు, జులై 18(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో లాగా అధికారులు ప్రజా సమస్యల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ అన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు గణపర్తి కిషోర్ నాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో జరిగింది. అరవపాళెం, బయ్యవారి కండ్రిగ, ఆరూరు, రాఘవారిపాళెం గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. అరవపాళెంలో రూ.10లక్షలతో నిర్మించిన సిమెంటు రోడ్‌ను ప్రారంభించారు. అరవపాళెం ఉన్నత పాఠశాల సమీపంలో ప్రధాన రహదారి దాటాలంటే ఇబ్బందిగా ఉందని, స్పీడ్ బ్రేకర్లు వేయించాలని, అలాగే మెయిన్ రోడ్ నుంచి స్కూల్ వరకు రోడ్డు వేయించాలని విద్యార్థులు ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఆయన సంబంధిత అధికారులుకు ఫోన్ చేసి తక్షణం చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే ఆరూరులో రూ.2 లక్షలతో ఏర్పాటు చేసిన తాగునీటి బోరు, రాఘవారిపాళెం గ్రామంలో రూ.5లక్షలతో నిర్మించిన సిమెంటు రోడ్‌ను ప్రారంభించారు. రాఘవారిపాళెం గ్రామానికి చెందిన మహిళల కోరిక మేరకు సిమెంట్ రోడ్లకు మరో రూ.10లక్షలు నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా గ్రామాల్లో తాగు, సాగునీటి సమస్య ఉత్పన్నవుతోందని, అధికారులు మారాలని లేని పక్షంలో చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. అనంతరం అంగనవాడీ టీచర్ ఉక్కు సుమతి ఆధ్వర్యంలో జరిగిన సామూహిక సీమంతం కార్యక్రమంలో పాల్గొని గర్భిణులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో సర్పంచులు నల్లారెడ్డి రాజేష్‌రెడ్డి, కాకి చెంగమ్మ, ఎంపీడీవో మనోహర్ గౌడ్, తహసీల్దారు సతీష్ కుమార్, నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు శివకోటరెడ్డి, గోపాల్‌రెడ్డి, మస్తాన్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు శరత్‌చంద్రారెడ్డి, గిరి నాయుడు, దేవుడు, ముత్తురాజా, శివారెడ్డి, కాపులూరు చెంచురామయ్య ఆచారి, వెంకటరమణయ్య, సుందరయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు ర్యాక్‌ల వితరణ

గూడూరు అర్బన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక దివిపాళెంలోని ప్రాథమికోన్నత పాఠశాలకు శుక్రవారం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో కొణిదల మునిగిరీష్, మునిభాస్కర్ దాతృత్వంతో స్టేషనరి ర్యాక్‌లను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా రోటరీక్లబ్ సభ్యులు మాట్లాడుతూ మునిరామయ్య వర్ధంతిని పురస్కరించుకుని వారి కుటుంసభ్యులు పాఠశాలకు ర్యాక్‌లను అందించారని తెలిపారు. కార్యక్ర మంలో మునిగిరీష్, వెంకటేశ్వర్లురెడ్డి, మల్లు విజయ్ కుమార్‌రెడ్డి, దశరధరామిరెడ్డి, మునిభాస్కర్, మోహన్‌దాస్, కుమార్, బాలకృష్ణంరాజు, శ్రీధర్‌రెడ్డి, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

హోంమంత్రి అనితకు సన్మానం


హోంమంత్రి అనితను సన్మానిస్తున్న తెలుగు మహిళా నేతలు

గూడూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): హోంమంత్రి అనితను గూడూరు నియోజకవర్గానికి చెందిన తెలుగు మహిళా నేతలు సన్మానించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన తెలుగు మహిళా ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న అనితను తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి, గుండాల లీలావతి, దువ్వూరు భారతి తదితరులు మొక్క అందజేసి శాలువతో సత్కరించారు.

కారును ఢీకొన్న టిప్పరు

చిల్లకూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చిల్లకూరు పోలీస్‌స్టేషన్ సమీపంలో శుక్రవారం కారును టిప్పరు ఢీకొంది. పోలీసుల వివరాల మేరకు... మదనపల్లి నుంచి జోన్నవాడ వెళుతున్న కారును టిప్పరు అదుపుతప్పి వెనుక నుంచి ఢీకొంది. దీంతో కారు డివైడర్‌ను ఢీకొనడంతో ముందుభాగం దెబ్బతినింది. కారులో ప్రయాణిస్తున్న వారికి ఎటువంటి గాయాలు కాలేదు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నారాయణమ్మకు ప్రత్యేక పూజలు

గూడూరు, జూలై 18(ఆంధ్రజ్యోతి): స్థానిక సొసైటీ కాలనీలోని నారాయణమ్మ పేరంటాళ్ల ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాడమాసం సందర్భంగా అమ్మవారిని శాకంబరిగా అలంకరించి పూజలు జరిపారు. ఆలయాన్ని వివిధ రకాల కూరగాయలతో ముస్తాబు చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించుకుని పూజలు జరిపారు.

ఆకుతోటకు నేతల సత్కారం


ఆకుతోట రమేష్ సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

సూళ్లూరుపేట. జూలై 18 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట ఏఎంసీ చైర్మన్‌గా నియమితులైన ఆకుతోట రమేష్‌ను శుక్రవారం సూళ్లూరుపేట మండల టీడీపీ అధ్యక్షుడు కొక్కు శంకరయ్య, నాయకులు గురుకల సుబ్రహ్మణ్యం, గురుకల కృష్ణయ్య, గొంజి వెంకటేశ్వర్లు సత్కరించారు.

23న ఉచిత వైద్యశిబిరం

గూడూరు అర్బన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఈనెల 23వ తేదీన లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మెహబూబ్‌బాషా శుక్రవారం తెలిపారు.

ప్రభుత్వ కార్యాలయంలో వైద్యశిబిరం

వాకాడు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. తహసీల్దారు రామయ్య, ఎంపీడీవో శ్రీనివాసులు, ఆర్ఐ అఖిల్, ఈవోపీఆర్‌డీ ఉమామహేశ్వరరావు, సిబ్బంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

గేదెను ఢీకొన్న బైక్
యువకుడికి తీవ్ర గాయాలు

కోట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్టేడు సమీపంలో ఉన్న రొయ్యల పరిశ్రమ వద్ద శుక్రవారం గేదెను మోటరు బైక్ ఢీకొట్టిన ఘటనలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం మేరకు... తిమ్మానాయుడుపాళెం గ్రామానికి చెందిన వరప్రసాద్ మోటరు బైక్‌లో కోట నుంచి గూడూరు వైపు వెళ్తుండగా చిట్టేడు రొయ్యల పరిశ్రమ వద్ద రోడ్డుపై వెళ్తున్న గేదెను ఢీకొట్టి కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వరప్రసాద్‌ను స్థానికులు 108 వాహనంలో గూడూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబసభ్యులు మెరుగైన చికిత్స కోసం నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సూళ్లూరుపేట, జూలై 18(ఆంధ్రజ్యోతి): చెంగాళమ్మ ఆలయ సమీపంలో ఉన్న సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పట్టణంలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ మోహిని తెలిపారు.

సమస్యలను పరిష్కరించే వరకు సమ్మె

గూడూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ వర్కర్ల సమస్యలను పరిష్కరించే వరకు సమ్మెను కొనసాగిస్తామని సీఐటీయూ నాయకులు స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో సమ్మె కొనసాగించారు. కార్యక్రమంలో కోటేశ్వరరావు, శివకుమార్, బీవీ రమణయ్య, మణి, రమణయ్య, పోలయ్య, సుబ్బారావు, వరలక్ష్మి, మునెమ్మ, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి రుద్రాభిషేకం

గూడూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాయిసత్సంగ నిలయంలోని విజయదుర్గాదేవి ఉపపీఠంలో శుక్రవారం ఆంజనేయ స్వామికి పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకుడు కోట సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో ఆంజనేయస్వామికి పాశుపత మహా రుద్రాభిషేకం, విశేష పూజలు చేశారు.

నల్లబ్యాడ్జీలతో మున్సిపల్ కార్మికుల ధర్నా

సూళ్లూరుపేట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలంటూ సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికులు శుక్రవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. తమ డిమాండ్లను అంగీకరించి సమస్యలను పరిష్కరించేంత వరకు సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికులకు సీఐటీయూ నాయకులు లక్ష్మయ్య, ఎస్కే రియాజ్, సాంబశివయ్య తదితరులు మద్దతు తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం


అంబేడ్కర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులు

నాయుడుపేట టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతబస్టాండ్ సమీపంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి సీఐటీయూ, మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు వినతిపత్రం అందజేశారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయం నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ముకుంద, అంగన్‌వాడీ ప్రాజెక్టు అధ్యక్షురాలు శ్యామలమ్మ, వర్కర్స్ యూనియన్ నాయకులు శీనయ్య, నాగరాజు, రామచంద్రయ్య, కాలేషా, తదితరులు పాల్గొన్నారు.

అసమానతల తగ్గింపే పీ-4 లక్ష్యం

నాయుడుపేట టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆర్థిక అసమానతలను తగ్గించడమే పీ-4 లక్ష్యమని మున్సిపల్ మేనేజర్ ఉరుకుందమ్మ అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో పీ-4పై ప్రజాభిప్రాయ సేకరణ, శంఖరాపురం, గెరిడీవీధి సచివాలయ పరిధిలోని వార్డుసభలు నిర్వహించారు.


పట్టువస్త్రాలను తీసుకువెళ్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ దంపతులు

శాకాంబరిగా చెంగాళమ్మ



సూళ్లూరుపేట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట చెంగాళమ్మ పరమేశ్వరి శుక్రవారం శాకాంబరి దేవిగా భక్తులకు దర్శన మిచ్చారు. ఆషాడ మాసాన్ని పురష్కరించుకుని రకరకాల పండ్లు, కూరగాయలతో అమ్మవారి మూల విరాట్‌ను అలంకరించారు. ఆలయం లోపల అమ్మవారి సన్నిధిలో కూడా పండ్లు, కూరగాయలతో పందిళ్లు వేసి సుందరంగా అలంకరించారు. అనంతరం వేదపండితులు, మంత్రోచ్ఛరణల ప్రత్యేక పూజలు వేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, పార్థసారధి దంపతులు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. వారికి దేవదాయశాఖ సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజలనంతరం వేదపండితులు ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అంద జేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్,నాయకులు చిట్టేటి పెరుమాల్, ఏలిమేటి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మేనకూరు సెజ్‌లో రూ.1800 కోట్లతో భారీ పరిశ్రమ ఏర్పాటుకు సన్నాహాలు

నాయుడుపేట/టౌన్, జూలై 18(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మండలం మేనకూరు సెజ్‌లో రూ.1800 కోట్లతో భారీ పరిశ్రమ ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. మన దేశానికి చెందిన సైర్మ ఎస్‌జీఎస్ లిమిటెడ్ కంపెనీ, సౌత్ కొరియాకు చెందిన షైనీఆప్ ఎలక్ట్రానిక్స్ కంపెనీ సంయుక్తంగా భారీ ఎలక్ట్రానిక్స్ పరిశ్రమను ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. ఈ కంపెనీలు ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డులు (పిసిబి), కాపర్ క్లాడ్ లామినెట్స్ (సిసిఎల్) ఉత్పత్తులను తయారు చేస్తాయి. వచ్చే ఆర్థిక నుంచి పరిశ్రమ పనులు ప్రారంభంకానున్నట్లు సమాచారం.

నిర్వాసితులకు న్యాయం చేస్తాం: ఆర్డీవో


నిర్వాసితులతో మాట్లాడుతున్న ఆర్డీవో కిరణ్మయి

పెళ్లకూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిల్లకూరు గ్రామంలో జాతీయ రహదారి విస్తరణలో ఇళ్లు కోల్పోయిన వారికి న్యాయం చేస్తామని సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి అన్నారు. శుక్రవారం చిల్లకూరు గ్రామంలో జాతీయ రహదారి విస్తరణలో ఇళ్లు కోల్పోయి మెరిమి సుబ్బారావు, చింతపూడి కాటరాజుతో ఆర్డీ మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్వాసితులు మాట్లాడుతూ ఇదే గ్రామంలో రహదారి విస్తరణలో ఇళ్లు కోల్పోయిన వారందరికీ రెట్టింపు పరిహారం అందజేశారని, సెంటు భూమిలేని తమకు మాత్రం తక్కువ పరిహారం ఇస్తామనడం ఏమిటని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్డీవో స్పందిస్తూ ఇంటి స్థలం పంచాయతీ పోరంబోకు కాబట్టి ఇంటికి మాత్రమే నష్టపరిహారం ఇస్తామని, ప్రభుత్వ నింబంధనల మేరకు అన్ని విధాలా న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ హరికృష్ణ, మండల సర్వేయర్ సుప్రజ, వీఆర్వో వంశీకృష్ణ, సచివాలయ సర్వేయర్ లక్ష్మణ్, వీఆర్ఏ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అంత దూరం పిల్లలను పంపలేం


విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈవో బాబయ్య

వెంకటగిరి టౌన్, జూలై 18(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పాళెంకోట ప్రాథమిక పాఠశాలలోని 3,4 తరగతులను మొక్కలపాడు ప్రాథమికోన్నత పాఠశాలలో విలీనం చేశారు. తమ పిల్లలను మొక్కలపాడు ప్రాథమికోన్నత పాఠశాలకు పంపేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు అభ్యంతరం తెలిపారు. దీంతో శుక్రవారం పీడీఎస్‌వో నాయకులు, ఎంఈవో బాబయ్య పాళెంకోట గ్రామానికి వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడారు. మొక్కలపాడుకు పిల్లలను పంపించడంలో ఉన్న ఇబ్బందులను తల్లిదండ్రులు ఎంఈవో దృష్టికి తీసుకెళ్లారు. పాళెంకోట నుంచి మొక్కలపాడుకు నాలుగు కిలోమీటర్లు ఉందని, వర్షాకాలంలో గొడ్డేరు వాగు ప్రవహిస్తే ఇబ్బందులు వస్తాయన్నారు. అటవీ మార్గంలో కావడంతో అడవి పందులు, ఎలుగుబంట్లు తిరుగుతుంటాయన్నారు. పాళెంకోట ప్రాథమిక పాఠశాలలోనే 3,4 తరగతులను కొనసాగించాలని కోరారు. లేదంటే పిల్లల చదువు మానిపించస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌వో నాయకుడు పవన్, గ్రామ సర్పంచి వేణుగోపాల్ రెడ్డి, తిరుపాల్ పాల్గొన్నారు.

'పల్లం' ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ఏర్పేడు, జూలై 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లం రెవెన్యూలో అంధనాల గుంత ప్రభుత్వ స్థలం 29.5 ఎకరాల్లో తహసీల్దారు భార్గవి శుక్రవారం ప్రభుత్వ హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేయించారు. గురువారం 'పల్లంపై పెద్దల కన్ను' అనే శీర్షికన ఆంధ్రజ్యోతి దినపత్రికలో వార్త ప్రచురితం కావడంతో తహసీల్దార్ స్పందించారు. గురువారం సర్వే పనులు చేపట్టి హద్దు రాళ్లు నాటించారు. అదే విధంగా రెండవ రోజు శుక్రవారం రెవెన్యూ అధికారులు రవితేజ, చెంచురెడ్డి తదితరుల ఆధ్వర్యంలో అంధనాల గుంత ప్రభుత్వ స్థలంలో ఎవరు ప్రవేశించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామంటూ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయించారు.

సీఎం పర్యటన ఏర్పాట్లపై కలెక్టర్ దిశానిర్దేశం

● తూకివాకం వేస్ట్ మేనేజ్‌మెంట్ పరిశీలన

రేణిగుంట, జూలై 18(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ఈనెల 19న శనివారం పర్యటించనున్న ప్రాంతాలను కలెక్టర్ వెంకటేశ్వర్ పరిశీలించారు. ఇందులో భాగంగా సీఎం కార్యక్రమాల కోఆర్డినేటర్ వెంకటేశ్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, తిరుపతి మునిపల్ కార్పొరేషన్ కమిషనర్ మౌర్యతో కలిసి తూకివాకం వేస్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సీఎం శనివారం ఉదయం తిరుపతి విమానాశ్రయం చేరుకుని అక్కడ నుంచి తిరుపతిలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమం పాల్గొంటారన్నారు. అనంతరం కపిలతీర్థం వద్ద జరిగే కార్యక్రమంలో హాజరై అక్కడినుండి పోలీస్ పరేడ్ మైదానంలో ప్రజా వేదిక కార్యక్రమానికి హాజరవుతారన్నారు. అనంతరం కంచి కామకోటి పీఠం మహాపాదుక మండపంలో జరిగే కార్యక్రమం తరువాత సాయంత్రం తిరుపతి విమానాశ్రయం చేరుకొని విజయ వాడకు తిరుగు ప్రయాణమవుతారన్నారు. సీఎం పర్యటనలో భద్రత ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు ఉండకూడదని ఆదేశించారు.

స్మార్ట్ మీటర్లు పెట్టవద్దు

పిచ్చాటూరు, జూలై 18(ఆంధ్రజ్యోతి): పాత విద్యుత్ మీటర్లనే కొనసాగించాలని, స్మార్ట్ మీటర్లు పెట్టొద్దని ప్రజా సంఘాల నాయకులు కోరారు. పట్టణంలోని జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశానికి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.నాగరాజు హాజరయ్యారు. గత వైసీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యుత్ ప్రైవేటీకరణ చేసి స్మార్ట్ మీటర్లు పెడుతుంటే మీటర్లను పగులగొట్టడండని పిలుపునిచ్చిన చంద్రబాబు, లోకేష్ నేడు వాటినే కొనసాగించడం అదానీకి దాసోహమవడమే అన్నారు. కొత్త మీటరు ఏర్పాటుకు అయ్యే ఖర్చును కూడా వినియోగదారుడిపైనే వేయడం దారుణమన్నారు. మూడు, నాలుగు సంవత్సరాల క్రితం వాడేసిన విద్యుత్ చార్జీలకు ఇప్పుడు ట్రూ అప్ చార్జీల పేరుతో మళ్లీ వసూలు చేయడం ఘోరమన్నారు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి జనార్దన్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మెలుగు రమేష్, జిల్లా కమిటీ సభ్యుడు నాగరాజు, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

● హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదం

కాంపాళెం యువకుడి మృతి



నరసింహులు (ఫైల్‌ఫొటో)

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వెళ్లిన మండలానికి చెందిన యువకుడు అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కాంపాళెం దళితవాడకు చెందిన జి.మల్లెమ్మ కుమారుడు జి.నరసింహులు (28)హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్నాడు. గురువారం రాత్రి ద్విచక్రవాహనంలో విధులకు వెళ్తుండగా బస్సు ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. నరసింహులు మీద ఆధారపడి తల్లి, సోదరి జీవిస్తున్నారు. నరసింహులు మృతదేహం హైదరాబాద్ నుంచి శనివారం ఉదయం స్వగ్రామానికి చేరుతుందని వారి బంధువులు తెలిపారు.

పేదలను ధనికులుగా చేయడమే పీ4 లక్ష్యం



సమావేశంలో మాట్లాడతున్న రమేష్

శ్రీకాళహస్తి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పీ4 పథక ఆశయం పేదలను ధనికులుగా చేయడమే లక్ష్యమని టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి కాసరం రమేష్ అన్నారు. పట్టణంలోని 12, 15 సచివాలయాల పరిధిలో పీ4పై అవగాహన కల్పించారు. పి.వివేక్ గౌడ్, కోరా రాకేష్, షేక్ మస్తాన్, అబ్దుల్ కరీం, అడ్మిన్ చంద్రమ్మ, వీఆర్వో మునిగోపాల్, మెప్మా సీసీ దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

పిచ్చాటూరు (ఆంధ్రజ్యోతి): మండలంలోని తులసికృష్ణాపురం పంచాయతీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం పీ4 సర్వేలో భాగంగా బంగారు కుటుంబాల ఎన్నికను ఎంపీడీవో మహ్మద్‌రఫి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముడియూరు పంచాయతీలో 37 కుటుంబాలను ఎంపిక చేశారు. సర్పంచ్ శ్యామల, గ్రామ కార్యదర్శి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ (ఆంధ్రజ్యోతి): పీ4 సర్వేను పారదర్శంగా చేపట్టాలని ఎంపీడీవో వెంకటరత్నమ్మ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, మండల స్థాయి అధికారులతో పీ4 సర్వేపై సమీక్షించారు. ప్రభుత్వ, ప్రైవేటు, ప్రజల భాగస్వామ్యంతో పేదరిక నిర్మూలన కోసం చేపట్టనున్న సర్వేతో నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు, ఆర్థిక సాయం తదితర లబ్ధి చేకూరుతుందని తెలిపారు. తహసీల్దార్ శ్రీదేవి, ఎస్ఐ విశ్వనాథ నాయుడు, ఏవో షణ్ముగం, సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, ఏఈలు ఇతర శాఖాధికారులు పాల్గొన్నారు

జీవో 36ను తక్షణమే అమలు చేయాలి

శ్రీకాళహస్తి, జూలై 18(ఆంధ్రజ్యోతి): జీవోరు 36ను తక్షణమే అమలు చేసి పురపాలక ఇంజనీరింగ్, పారిశుధ్య కార్మికుల వేతనాలు పెంచాలని సీఐటీయూ నాయకుడు మునిరాజా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల 12 నుంచి సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికులకు మద్దతుగా పురపాలకసంఘ కార్యాలయం వద్ద సీఐటీయూ నాయకులు శుక్రవారం నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేటగిరీల నిర్ణయంలో జరిగిన పొరపాట్లను జీవో 11 ద్వారా సరిదిద్దాలని కోరారు. షరతులు లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇంజనీరింగ్, పారిశుధ్య కార్మికు లందరికీ వర్తింపజేయాలన్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, ఎక్స్‌గ్రేషియా పెంచాలన్నారు. సీఐటీ యూ జిల్లా ఉపాధ్యక్షుడు అంగేరి పుల్లయ్య, కార్యదర్శి గురవయ్య, గంధం మణి తదితరులు పాల్గొన్నారు.

కూటమి సుపరిపాలన స్పష్టంగా కనబడుతోంది

సత్యవేడు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ సుపరిపాలన స్పష్టంగా కనబడుతోందని టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి పరుచూరి శివకుమార్ తెలిపారు. పట్టణంలోని పల్లపువీధి, తంబుశెట్టి వీధిలో శుక్రవారం 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలు పంచుతూ సంక్షేపథకాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. యూనిట్ ఇన్‌చార్జి దిలీప్, బూత్ ఇన్‌చార్జి షణ్ముగం పాల్గొన్నారు.

కేసింగ్ పైపులను అందిస్తాం

వరదయ్యపాళెం, జూలై 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవర్ధనపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో సుమారు 278మంది విద్యార్థులు చదువుతున్నారు. వారికి పాఠశాలలో గతంలో ఉన్న బోరు ద్వారా సరిపడినంత నీరు రావడంలేదు. దీంతో పాఠశాల యాజమాన్యం, గ్రామస్తుల సహకారంతో 200 అడుగుల లోతు మేర బోరు వేసేందుకు నిర్ణయించారు. ఇందుకు 80 అడుగుల బోర్ కేసింగ్ పైపులను అందించాలని లోక ఫౌండేషన్ సీఈవో లోకేష్ దాసాజీ, సునీల్‌దాసాజీని శుక్రవారం కోరారు. దీంతో వారు సానుకూలంగా స్పందించారు. వారికి పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థులు ధన్యవాదాలు తెలిపారు.



పాకాల మండలం పులివర్తివారిపల్లెలో శుక్రవారం చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని తల్లి లక్ష్మీభారతి పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సుధీర్, తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి - ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, గాలి భానుప్రకాష్

హిందీ టీచర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

సత్యవేడు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మహాత్మ జ్యోతీబా పూలే బాలుర గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న హిందీ టీచర్ పోస్టుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సత్యనారాయణ పేర్కొన్నారు. హిందీ పండిట్ ట్రైనింగ్ పూర్తి చేసి ఆసక్తి కలిగిన అభ్యర్థులు పాఠశాలలో నేరుగా దరఖాస్తు సమర్పించ వచ్చన్నారు.

హంస, రావణబ్రహ్మ వాహనాలపై కుమారస్వామి రాజసం

శ్రీకాళహస్తి, జూలై 18(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా విజ్ఞానగిరిపై కొలువై ఉన్న వళ్లీ, దేవసేన సమేత కుమారస్వామి శుక్రవారం హంస వాహనంపై విహరించారు. ఆలయంలోని అలంకార మండపంలో స్వామిఅమ్మవార్లకు పలు రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విశేషంగా అలంకరించారు. ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాలు, మేళతాళాల నడుమ స్వామి అమ్మవార్లను హంసవా హనంపై అధిష్టించారు. పురవీధుల్లో ఊరేగుతున్న స్వామి అమ్మవార్లను భక్తులు దర్శించుకుని కర్పూర నీరాజ నాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఈవో బాపిరెడ్డి, ఆలయ అధికారులు పాల్గొన్నారు. ఇక రాత్రి దేవేరుల సహా సుబ్రహ్మణ్యస్వామి రావణబ్రహ్మ వాహనంపై పురవిహారం చేశారు.



హంస, రావణబ్రహ్మ వాహన సేవలు

చలో విజయవాడను విజయవంతం చేయండి

శ్రీకాళహస్తి, జూలై 18(ఆంధ్రజ్యోతి): పాత సర్వీసు నిబంధనలు వర్తింపజేసి అందరికీ ఏఎల్ఎం పదోన్నతులు ఇవ్వాలని ఏఐటీయూసీ అనుబంధ ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. అసోసియేషన్ ప్రతినిధి బొజ్జ మునిహరికృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద చలో విజయవాడ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 21న జరిగే విజయవాడ రామవరప్పాడు రోడ్డు నుంచి విద్యుత్ సౌధ వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో పవన్, పాండు, విజయ్, మహేష్, గురవయ్య, శ్రీదర్, చందు, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ నిర్మాణం పూర్తి చేస్తాం

● ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



అసంపూర్తి అంగన్‌వాడీ పరిశీలన

కేవీబీపురం, జూలై 18(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ నిర్మాణాన్ని త్వరితగిత పూర్తి చేయిస్తామని ఐసీడీఎస్ సీడీపీవో సౌభాగ్యం చెప్పారు. మండలంలోని వేమలపూడిలో 'అద్దె ఇంట్లో అంగన్‌వాడీ కేంద్రం' శీర్షికన శుక్రవారం ప్రచురితమైన కథనానికి స్పందించారు. వేమలపూడి అంగన్‌వాడీని తనిఖీ చేశారు. వెంటనే ఎంఈవో లక్ష్మీపతితో మాట్లాడారు. కేంద్రంలోని సామాన్లను ప్రాథమిక పాఠశాలలో ఖాళీగా ఉన్న గదిలోకి మార్పు చేయించారు. సూపర్‌వైజర్ కల్పలత, అంగన్‌వాడీ తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాలతో పర్యావరణానికి ముప్పు

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రానిక్, ప్లాస్టిక్ వ్యర్థాలతో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని ఎంపీడీవో వెంకటరత్నమ్మ తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎలక్ట్రానిక్, ప్లాస్టిక్ వ్యర్థాలతో పర్యావరణానికి ముప్పుపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎలక్ట్రానిక్, ప్లాస్టిక్ వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతులలో నిర్వహిస్తే జల, భూకాలుష్యం తగ్గుతుంద న్నారు. ఈ దుష్పరిణామాలను అడ్డుకోవాలంటే విద్యార్థులు, పౌరులు హెచ్ఎం రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధిద్దాం

శ్రీకాళహస్తి, జూలై 18(ఆంధ్రజ్యోతి): ప్లాసిక్ వాడకాన్ని నిషేధిద్దామని ప్రిన్సిపాల్ నాగరాజునాయుడు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కమిటీ ఆధ్వర్యంలో జరిగిన అవగాహనలో ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత రోజుల్లో ప్లాస్టిక్‌ను అతిగా వినియోగిస్తే క్యాన్సర్ వచ్చే ప్రమాదముందన్నారు. ప్లాస్టిక్ వినియోగం, నివారణ, రీ సైక్లింగ్‌పై అవగాహన కల్పించారు. అధ్యాపకులు నరసింహవర్మ, బాపనయ్య, సునీత, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

సత్యవేడు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ప్రజలు తమ సమస్యలను సకాలంలో పరిష్కరించుకునేందుకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)ను సద్వినియోగం చేసుకోవాలని డివిజనల్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ గుత్తి త్యాగరాజు తెలిపారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోనట్లయితే పీజీఆర్ఎస్‌లో నమోదు చేసుకోవచ్చన్నారు. నమోదు చేసుకున్న సమస్యలకు అధికారులు నిర్దిష్ట సమయంలో స్పందించి పరిష్కారానికి చర్యలు చేపడుతారని వెల్లడించారు.

చంద్రబాబుతోనే సంక్షేమం సాధ్యం



తొట్టంబేడు, కోబాకల్లో కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

శ్రీకాళహస్తి, జూలై 18(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుతోనే సంక్షేమం, అబివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం తొట్టంబేడు మండలం తంగేళ్లపాళెం పంచాయతీలో ఇంటింటికి తిరిగి కరపత్రాలను అందజేశారు. పథకాలు అందుతున్నాయా అని ఆరా తీశారు. మాజీ ఎమ్మెల్యే సత్రవాడ మునిరామయ్య, నాయకులు ఎస్సీవీ దిలీప్, ఎస్సీవీ కిరణ్, సర్పంచ్ చెంచు కృష్ణనాయుడు, నాయకులు మోహన్‌నాయుడు, భాస్కర్‌నాయుడు, సుధాకర్, నారాయణయాదవ్, బాలాజీనాయుడు, రఘురాం, కిషోర్, ఢిల్లీ ప్రతాప్, సుదర్శననాయుడు, చందు, కయ్యూరి శివ, ప్రకాష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

● పట్టణంలోని 28వ వార్డులో టీడీపీ పట్టణ అధ్యక్షుడు విజయకుమార్, నాయకులు కంఠా రమేష్, రమేష్‌బాబు, భాస్కర్‌గౌడ్ తదితరులు పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు సిమెంటు రోడ్లు, మురుగునీటి కాలువలు నిర్మించాలని, బోరుకు మరమ్మతులు చేయాలని కోరారు.

కేవీబీపురం (ఆంధ్రజ్యోతి): మండలంలోని కళత్తూరులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని తిరుపతి పార్లమెంటు తెలుగురైతు అధ్యక్షుడు గోపీనాథరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. సంక్షేమ పథకాలు అందని వారు తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. మధుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఏర్పేడు (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయాలంటే టీడీపీ ప్రభుత్వానికే సాధ్యమని ఆ పార్టీ నాయకుడు సూరినాయుడు అన్నారు. మండలంలోని కోబాక పంచాయతీలో శుక్రవారం సుపరిపాలనలో తొలి అడుగు నిర్వహించారు. టీడీపీ నాయకులు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకు న్నారు. శ్మశాన వాటికకు దారి సౌకర్యం కల్పించాలని కోబాక దళితవాడవాసులు కోరారు. నాగరాజునాయుడు, గురవారెడ్డి, పొనాట్నరావు, గౌరి, శివశంకర్‌రెడ్డి, చంద్రారెడ్డి, రమణయ్య, నరసింహులుయాదవ్ పాల్గొన్నారు.

తాగునీటి సౌకర్యం కల్పించడమే లక్ష్యం



వాటర్‌ప్లాంట్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి, జూలై 18(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ప్రతి ఒక్కరికి తాగునీటి సౌకర్యం కల్పించడమే లక్ష్యమని ఎమ్మెల్యే సుధీర్ అన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగులో భాగంగా శుక్రవారం ఊరందూరు హరిజనవాడలో బస్‌షెల్టర్‌ను ప్రారంభించారు. అనంతరం తొట్టంబేడు మండలం చేమూరు, రాంబట్లపల్లి, గొట్టిపూడి, కనపర్తిల్లో గ్రీన్‌పానల్ కంపెనీ సీఎస్ఆర్ ఫండ్ ద్వారా ఏర్పాటు చేసిన ఆర్వో పాంట్లను ప్రారంభించారు. అనంతరం గొట్టిపూడి ఎస్టీకాలనీలో తొలిఅడుగు కార్యక్రామన్ని నిర్వహించారు.

సీపీఐ పట్టణ కార్యదర్శిగా రొడ్డ గోపి



శ్రీకాళహస్తి, జూలై 18(ఆంధ్రజ్యోతి): సీపీఐ పట్టణ కార్యదర్శిగా రొడ్డ గోపి నియమితు లయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పార్టీ తనపై ఉంచిన నమ్మకంతో పట్టణంలో ఉన్న పేద, మధ్య తరగతి, కార్మిక, కర్షక, ఉద్యోగుల సమస్యలపై పోరాటాలు చేస్తానని తెలిపారు. పార్టీని బలోపేతం చేసి ముందుకు తీసుకెళ్తానన్నారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మురళి, నియోజకవర్గ కార్యదర్శి గురవయ్యకు ధన్యవాదాలు తెలిపారు.

ఎర్రచందనం స్వాధీనం?

వరదయ్యపాళెం, జూలై 18(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో అక్రమంగా తరలిస్తున్న ఎర్రచందనం దుంగలను వాహనంతో పాటు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. శ్రీకాళహస్తి నుంచి తడ వైపు ఓ మినీలారీలో 10 ఎర్రచందనం దుంగలను తమిళనాడుకు తరలిస్తుండగా బస్టాండు సమీపంలో పోలీసులు నిఘా వేసి దుంగల సహా వాహనాన్ని సీజ్ చేసి ముగ్గురు నిందితులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి త్వరలోనే వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతి

వరదయ్యపాలెం, జూలై 18(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంలో పాడి ఆవు మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని సాధనవారిపాళెంలో జరిగింది. రైతు ప్రతాప్ తెలిపిన వివరాలు... శుక్రవారం ఉదయం తన ఆవులను మేత కోసం తీసుకెళ్లగా మేసే సమయంలో సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఉన్న తీగలు తగలి ఆవు మృతి చెందిందన్నారు. రూ.50వేల పాడి ఆవును పోగొట్టుకున్నట్లు రైతు విలపించాడు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరాడు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన సుబ్బయ్య



శ్రీకాళహస్తి, జూలై 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేశ్‌ను శుక్రవారం ఉండవల్లిలోఆయన స్వగృహంలో రాష్ట్ర గిరిజన సలహా మండలి సభ్యుడు మాసారపు సుబ్బయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన్ను ముక్కంటి శేషవస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. కాగా యానాదులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని మంత్రిని కోరగా సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు.

శ్రీనిధి లక్ష్యం రూ. 10 కోట్లు

సత్యవేడు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలానికి 2025-26 ఆర్థిక సంవత్సరానికి శ్రీనిధి రుణాలు రూ.10 కోట్లు అందించాలన్న లక్ష్యంగా ముందుకు వెళుతున్నట్లు శ్రీనిధి సత్యవేడు క్లస్టర్ ఇన్‌చార్జి మేనేజర్ అంజద్‌బాషా చెప్పారు. వెలుగు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... ఈ ఆర్థిక సంవత్సరంలో 1076 మంది డ్వాక్రా సభ్యులకు రుణాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే 686 మందికి రూ.5 కోట్లు శ్రీనిధి రుణాలను అందించామన్నారు. శ్రీనిధి రుణాలలో రూ. లక్ష తీసుకున్న డ్వాక్రా సభ్యులు 36 నెలల పాటు వాయిదా పద్ధతిలో చెల్లించుకోవచ్చని వెల్లడించారు. శ్రీనిధి రుణాలకు వడ్డీ 95 పైసలు ఉంటుందని తెలిపారు. శ్రీనిధి రుణాల కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న 48 గంటల్లో బ్యాంకుల్లో సొమ్ము జమ అవుతుందని చెప్పారు.

23న పిచ్చాటూరులో జాబ్‌మేళా

నారాయణవనం, జూలై 18(ఆంధ్రజ్యోతి): యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే ఆదిమూలం పేర్కొన్నారు. శుక్రవారం నారాయణవనం ఎంపీడీవో కార్యాలయంలో ఈనెల 23 పిచ్చాటూరులో జరగనున్న జాబ్‌మేళా పోస్టర్లను ఆవిష్కరించారు. మేళాలో ఈఎంసీ క్లస్టర్, శ్రీసిటీ, తిరుపతి, చెన్నైకి చెందిన 15 బహుళ జాతీయ కంపెనీల్లో 500 పైగా ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. జడ్పీటీసీ సభ్యుడు సుమన్‌కుమార్, నెడ్‌క్యాప్ చైర్మన్ ఆర్డీ ఏకాంబరం, మాజీ ఎంపీపీ భక్తవత్సలం, గోవిందస్వామి తదితరులు పాల్గొన్నారు.

నాగాలమ్మకు ప్రత్యేక పూజలు



ఏర్పేడు, జూలై 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని వికృతమాలలో కొలువై ఉన్న నాగాలమ్మకు శుక్రవారం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఆలయ పూజారి వెంకట్రామయ్య ఆధ్వర్యంలో జరిగిన పూజలకు సమీప గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. వి.బాలాజీ నాయుడు, హేమాక్షి రాయల్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

జిల్లా ఇన్‌చార్జి మంత్రికి ఘనస్వాగతం

రేణిగుంట జూలై 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రెవెన్యూ శాఖ, తిరుపతి జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు ఘన స్వాగతం లభించింది. ఈనెల 19న సీఎం చంద్రబాబు పర్యటన సందర్భంగా శుక్రవారం రాత్రి ఇండిగో విమానంలో విజయవాడ నుంచి తిరుపతి విమానాశ్రయం చేరుకున్న మంత్రికి కలెక్టర్ వెంకటేశ్వర్ స్వాగతం పలికారు. ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలుపై తిరగబడండి



భూమన, సిపాయికి సన్మానం

శ్రీకాళహస్తి, జూలై 18(ఆంధ్రజ్యోతి): హామీలు అమలు చేయని కూటమి ప్రభుత్వంపై ప్రజలు తిరగబడాలని వైసీపీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో టీడీపీ మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ క్యూఆర్ కోడ్‌ను ప్రారంభించారు. ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.